తెలుగు దినపత్రిక
ప్రభాత జయభేరి
jayabheridaily.com
సంపుటి : 01
సంచిక : 19
పేజీలు : 8
వెల : 4
మల్కాజిగిరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సోమవారం, 31-07-2023

జయభేరి దినపత్రిక, జయభేరి ఛానల్‌లో
నిఖార్సైన జర్నలిస్టులుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు.. కథనాలు...
ఎలాంటి ఆంక్షలు లేకుండా రాయాలనుకుంటున్నారా?
మీ కలాలకు పదును పెట్టండి....
విలేకర్లు కావలెను
ఆసక్తి కలిగిన యువతి యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత
email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com
9391 544 889 call me

# అసలు టీ కాంగ్రెస్ లో ఏం జరుగుతోంది?



**జయభేరి, హైదరాబాద్ :**

కర్ణాటక ఫలితాల తర్వాత తెలంగాణలో దూకుడు పెంచింది కాంగ్రెస్. ఈసారి తెలంగాణలో కూడా ఎలాగైనా అధికారంలోకి రావాలన్న కసితో ఉంది. ఇప్పటికే పలు భారీ సభలను తలపెట్టింది. కీలక హామీలపై డిక్లరేషన్ లను కూడా చేసింది. రాబోయే రోజుల్లో అగ్రనేతల పర్యటనలు కూడా ఉండనున్నాయి. గెలిచే అభ్యర్థులపై ఫోకస్ పెట్టిన కాంగ్రెస్... ఆపరేషన్ ఆకర్ష్ ను విజయవంతంగా పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తోంది. పొంగులేటి, జూపల్లితో పాటు ఇతర నేతలను పార్టీలోకి రప్పించటంలో సక్సెస్ అయింది. ఇంతవరకు బాగానే ఉన్న.... పలువురు సీనియర్ నేతలు తమపై 'కుట్ర' చేస్తున్నారంటూ గొంతెత్తటం హాట్ టాపిక్ గా మారింది. ఇక మరికొందరు నేతలు సైలెంట్ మోడ్ ఆప్షన్ ఎంచుకున్నారు. ఫలితంగా అసలు తెలంగాణ కాంగ్రెస్ లో అసలేం జరుగుతోందన్నది హాట్ టాపిక్ గా మారింది. తాజా పరిణామాలతో కేడర్ కూడా కన్ఫ్యూషన్ లో పడినట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్ కు చెందిన పలువురు కీలక నేతలు కారెక్కుతారు...! జాబితా ఇదే అంటూ ప్రముఖంగా కొందరి నేతల పేర్లతో కూడిన లీక్ లు వస్తున్నాయి. ఎన్నికల సమీపిస్తున్న కొద్ది ఈ ప్రచారం మరింత ఊపందుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. దశాబ్ధాల కాలంపాటు పార్టీతోనే ఉన్న సదరు నేతలు సడన్ గా ఎందుకు మారాల్సి వస్తోంది..? నిజంగానే పార్టీ మారుతున్నారా..? కేసీఆర్ తో టచ్ లో ఉన్నారా అన్న కథనాలు కూడా జోరుగా ప్రసారమవుతున్నాయి. వీటికి చెక్ పెట్టేలా కొందరు నేతలు... బహిరంగంగానే తమ ఆవేదన వెల్లుబుచ్చారు. ఇటీవలే మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్... బహిరంగ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కమిటీలో చోటు ఇవ్వకుండా కుట్ర చేశారని... ఇప్పుడు ఏకంగా పార్టీ మారుతున్నారంటూ దుష్ప్రచారానికి తెగబడ్డారంటూ లేఖలో పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ తో ఉన్నానని చెప్పిన ఆయన... పార్టీ మారే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి పరిస్థితి కూడా సేమ్..! సొంత పార్టీ నేతలే తనను టార్గెట్ చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిస్తున్నారంటూ గతంలో ఆరోపించారు ఉత్తమ్. ఈ అంశంపై ఆగ్రహంతో ఉన్న ఉత్తమ్ కు ...ఇటీవలే కాలంలో వస్తున్న వార్తలు మరింత ఇబ్బందికరంగా మారాయి. ఉత్తమ్ దంపతులు కూడా గులాబీ పార్టీలో చేరుతున్నారంటూ తెగ ప్రచారం నడుస్తోంది. ఏకంగా పోటీ చేసే స్థానాలు కూడా బయటికి వస్తున్న పరిస్థితి నెలకొంది. పార్టీ మార్పు అంశంపై స్పందిస్తూ... చాలాసార్లు ఖండించారు ఉత్తమ్. బీఆర్ఎస్ లో చేరుతున్నట్లు తనపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ... భావోద్వేగపూరితమైన అంశాలను ప్రస్తావించారు. గత 2 సంవత్సరాలుగా పూర్తిగా తప్పుడు, పరువు నష్టం కలిగించే కథనాలతో నిరంతరం తమను లక్ష్యంగా చేసుకోవడం దురదృష్టకని పేర్కొన్నారు. ఇలా మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి బహిరంగంగానే తమ ఆవేదనను వ్యక్తం చేశారు. సొంత పార్టీలోని నేతలే కుట్ర చేస్తున్నారంటూ చెప్పటంతో... టీ కాంగ్రెస్ లోని పరిస్థితులు అర్థంకాకుండా మారిపోయాయి. ఇక ఉమ్మడి మెదక్, నల్గొండ జిల్లాకు చెందిన కొందరి నేతల పేర్లు కూడా పార్టీ మారే జాబితాలో ఉన్నాయి. వారు కూడా తమపై కుట్ర చేస్తున్నారంటూ మాట్లాడుతారా..? లేక వచ్చిన వార్తలను నిజం చేస్తూ... కారెక్కుతారా అనేది చూడాలి. మొత్తంగా అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ.. పార్టీలోని అంతర్గత కుమ్ములాటలు మళ్లీ తెరపైకి వస్తున్నట్లు కనిస్తోంది. అసలు వీరిపై కుట్ర చేయాల్సిన అవసరం ఎవరికి వచ్చింది..? ఎందుకు కుట్ర చేస్తున్నారనేది కూడా...? టాక్ ఆఫ్ ది పాలిటిక్స్ గా మారింది. పార్టీ నుంచి బయటికి పంపేందుకు ఓ ప్లాన్ ప్రకారం ఇదంతా చేస్తున్నారా అన్న కోణంలో కూడా చర్చ కూడా మొదలైంది. వీటన్నింటినికి బాధ్యులు ఎవరనే దానిపై హైకమాండ్ జోక్యం చేసుకుంటుందా..? లేక సీనియర్ నేతల ఆవేదనను లైట్ గా తీసుకుంటుందా అనేది చూడాలి...?



## వరద పరిస్థితిపై సీఎం కేసీఆర్ సమీక్ష

2 లో

# అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

## నేడు తెలంగాణ వరద ప్రాంతాలకు కేంద్ర బృందం

తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వేల కోట్ల నష్టం జరిగింది. అసలు ఎంత నష్టం జరిగిందో అంచనా వేసేందుకు ఇంటర్ మినిస్టీరియల్ కేంద్ర బృందం (ఐఎంసీటీ) తెలంగాణలో పర్యటించనుంది. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్డీఎంఏ) సలహాదారు కునాల్ సత్యార్థి నేతృత్వంలోని ఈ బృందంలో వ్యవసాయం, ఆర్థిక, జలశక్తి, విద్యుత్, రోడ్డు రవాణా, రహదారులు, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్సీ) మంత్రిత్వ శాఖలు / విభాగాల ప్రతినిధులు ఉంటారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు కేంద్ర బృందాన్ని తెలంగాణకు పంపుతున్నట్లు కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు జీ.కిషన్ రెడ్డి కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. గత వారం రోజులుగా తెలంగాణలో కురిసిన భారీ వర్షాలకు 18 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు నిలిచిపోవడంతో సహాయక చర్యలు శనివారం వేగం పుంజుకున్నాయి. మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. శాంతికుమారితో మాట్లాడి సహాయక చర్యలను సీఎం కేసీఆర్ పర్యవేక్షించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 31 నుంచి కేంద్ర బృందం తెలంగాణలో పర్యటించనుంది. ఐఎంసీటీ పర్యటన ఆధారంగా నష్టాన్ని అంచనా వేసి, రాష్ట్ర ప్రభుత్వ సమగ్ర వినతిపత్రం సమర్పించిన తర్వాత కేంద్ర బృందం రెండోసారి రాష్ట్రంలో పర్యటించే అవకాశం ఉంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను తెలంగాణ బీజేపీ సీనియర్ నాయకుల ప్రతినిధి బృందంతో కలిసి, తీవ్రమైన వరద పరిస్థితిని ఆయనకు వివరించారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. భారీ వర్షాలు, వరదల వల్ల పౌర జీవనం స్తంభించింది, పంటలు దెబ్బతిన్నాయి, రైతులకు భారీ నష్టం వాటిల్లింది. అనేక మంది నిరాశ్రయులయ్యారు. నష్టాన్ని అంచనా వేయడానికి వెంటనే ఉన్నత స్థాయి అధికారుల బృందాన్ని తెలంగాణకు పంపాలని హోం శాఖ కార్యదర్శిని అమిత్ షా ఆదేశించారని పేర్కొన్నారు.



## నేడు రేపు తెలంగాణలో వర్షాలు

తెలంగాణలో మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. సోమ, మంగళవారాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవొచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది. తెలంగాణలోని పలు జిల్లాల్లో మంగళవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. రాష్ట్రంలో గత వారం భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్థమైంది. రాష్ట్ర వ్యాప్తంగా ఏకధాటిగా వర్షాలు కురవడంతో భారీ నష్టం వాటిల్లింది. కొన్ని చోట్ల ప్రాణ నష్టం కూడా వాటిల్లింది. మరోవైపు ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో సోమ, మంగళవారాల్లో భారీగా వానలు పడే సూచనలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ మేరకు పసుపు రంగు హెచ్చరికను జారీ చేసింది. సోమవారం తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది. ఆదివారం సంగారెడ్డి జిల్లా జన్నారంలో 40.3 మిల్లీమీటర్లు, మేడ్చల్‌లో 37.5, మెదక్ జిల్లా కాగజ్ మద్దూర్‌లో 35మి.మీ, యాదాద్రి జిల్లా బీబీనగర్ 27.5 మిల్లీ మీటర్లు, నిర్మల్ జిల్లా విశ్వనాథ్‌పూర్ 27మి.మీ, సంగారెడ్డి జిల్లా లక్ష్మిసాగర్ 26.8మి.మీ, మేడ్చల్ జిల్లా కేశవరంలో 26మి.మీ, ఆలియాబాద్‌లో 25మి.మీ, బండ మాదారంలో 24.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సంగారెడ్డి, మంచిర్యాల, ఆదిలాబాద్, జగిత్యాల, నిజామాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, జనగామ, మహబూబాబాద్, ఖమ్మం, సూర్యాపేట, వికారాబాద్ జిల్లాలతో పాటు, జీహెచ్ఎంసీ పరిధిలోని కూకట్‌పల్లి, బాచుపల్లి, సికింద్రాబాద్, నేరెడ్‌మెట్ తదితర ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి.

**గత ఏడాదితో పోలిస్తే తక్కువే...**

ఈ ఏడాది భారీ వర్షాలు జనాన్ని హడలెత్తించినా గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత సీజన్‌లో వర్షాలు 19 శాతం తక్కువగా ఉన్నాయని వాతావరణ కేంద్రం తెలిపింది. గత ఏడాది జూన్ నుంచి జులై 30 వరకు 687.1 మిల్లీమీటర్ల వాన పడింది. ఈ ఏడాది ఇప్పటివరకు 559.1 మిల్లీమీటర్లు మాత్రమే కురిసిందని తెలిపింది. జులైలో నిర్మల్ మండలంలో అత్యధికంగా 16.5సెంటి మీటర్ల వర్షం పడింది. కరీం నగర్ రూరల్ మండలంలో 16, నిర్మల్ గ్రామీణ మండలం 14.9, ఖానాపూర్ 13.1, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం 12.6, రాయికల్ 10.3, జగిత్యాల గ్రామీణ మండలం 10.2, నిర్మల్ జిల్లా లక్ష్మణ్‌చాంద 9.8, జగిత్యాల జిల్లా గొల్లపల్లి 8, కరీంనగర్ జిల్లా వీణవంకలో 7.5 సెంటిమీటర్ల వర్షం పడిందని వెల్లడించింది.

# జూపల్లి టార్గెట్ గా 'ఆపరేషన్ ఆకర్ష్'



అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కొల్లాపూర్ రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. మొన్నటి వరకు ఇక్కడ ఏకపక్షంగా బీఆర్ఎస్ రాజకీయం నడవగా... తాజాగా సీన్ మారిపోయింది. జూపల్లి బయటికి వచ్చి కాంగ్రెస్ లో చేరేందుకు సిద్ధమవ్వటంతో రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. త్వరలోనే కొల్లాపూర్ వేదికగా భారీ సభను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సభకు ప్రియాంక గాంధీ కూడా రాబోతున్నారు. జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేతలు కూడా కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఇదిలా ఉంటే... జూపల్లికి షాక్ ఇచ్చేలా బీఆర్ఎస్ రివర్స్ ఆపరేషన్ ఆకర్షన్ షురూ చేసింది. ఆయన వర్గంలో ఉన్న కీలక నేతలను తమవైపు తిప్పుకునే పనిలో పడింది. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ను ఓడించడమే తన లక్ష్యమని జూపల్లి పదేపదే చెబుతున్నారు. సమయాన్ని బట్టి సర్కార్ పై తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తూ వస్తున్నారు. అయితే ఆయన దూకుడుకు బ్రేక్ లు వేసేలా గులాబీ హైకమాండ్ కూడా చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో కొల్లాపూర్ లో గులాబీ జెండా ఎగరవేయాలని గట్టిగా భావిస్తోంది. ఇక త్వరలోనే భారీ సభ నిర్వహించేందుకు సిద్ధమవుతున్న వేళ... గట్టి షాక్ ఇచ్చింది బీఆర్ఎస్. జూపల్లికి ప్రధాన అనుచరుడుగా ఉన్న కోడేరు ఎంపీపీ కొండ వెంకటరాధ, కొండ సుధాకర్‌రెడ్డి కేటీఆర్ సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సమక్షంలో... వీరికి పార్టీ కండువా కప్పి కేటీఆర్ పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో బీరంను మరోసారి ఎమ్మెల్యే గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ చేరికకు సంబంధిచి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ట్వీట్ చేశారు. అభివృద్ధికే మా ఓటు.. 20 ఏండ్ల దగాకు బైబై అంటూ రాసుకొచ్చారు. ఎంపీపీ చేరిన ఫొటోను తన ట్వీట్ కు జత చేశారు. ఇక 2018 ఎన్నికల్లో కొల్లాపూర్ లో కాంగ్రెస్ నుంచి గెలిచిన బీరం హర్షవర్ధన్ రెడ్డి... ఆ తర్వాత కారెక్కారు. అయితే జూపల్లి, బీరం వర్గాల మధ్య విబేధాలు తారా స్థాయికి చేరాయి. ఓ దశలో బహిరంగ చర్చకు కూడా సిద్ధమయ్యారు. దీంతో కొల్లాపూర్ లో రణరంగంగా మారిపోయింది. ఈ పరిణామాలపై కేటీఆర్ కూడా రంగంలోకి దిగి... జూపల్లిని బుజ్జగించే ప్రయత్నం చేశారు. జిల్లా పర్యటనకు వెళ్లిన కేటీఆర్... జూపల్లి ఇంటికి కూడా వెళ్లారు. పలు అంశాలపై కూడా చర్చించారు. అయితే పరిస్థితి సద్దుమణుగుతుందని అంతా భావించారు. కానీ స్థానిక ఎమ్మెల్యేపై జూపల్లి బహిరంగ పోరాటానికి దిగారు. బీఆర్ఎస్ సర్కార్ పై కూడా విమర్శనాస్త్రాలు సంధిస్తూ వచ్చారు. పొంగులేటితో కలిసి కాంగ్రెస్ లో చేరాలని నిర్ణయించుకున్నారు. దీంతో వీరిద్దరిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ... బీఆర్ఎస్ అధినాయకత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# ఆగస్ట్ 2న స్టాఫ్ నర్సు రాత పరీక్ష

## అభ్యర్థుల పాటించాల్సిన నిబంధనలివే!



**జయభేరి, హైదరాబాద్ :**

రాష్ట్ర వ్యాప్తంగా 5,204 స్టాఫ్ నర్సు పోస్టులకు ఆగస్టు 2న రాత పరీక్ష నిర్వహిస్తున్నారు. ఇప్పటికే హాల్ టికెట్లు మెడికల్ బోర్డు వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు పలు సూచనలు చేశారు అధికారులు. తెలంగాణలో స్టాఫ్ నర్స్ ఉద్యోగాల భర్తీకి ఆగస్టు 2న రాత పరీక్ష నిర్వహించనున్నారు. రాత పరీక్షకు హాల్ టికెట్లు వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచినట్లు మెడికల్ బోర్డు ప్రకటించింది. మొత్తం 5,204 స్టాఫ్‌నర్సుల పోస్టుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా 40,926 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అభ్యర్థులు ఆగస్టు 1వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని మెడికల్ బోర్డు తెలిపింది. ఆగస్టు 2న నిర్వహించే కంప్యూటర్ ఆధారిత పరీక్ష (CBT)ను హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుంచి 10.20 గంటల వరకు, మధ్యాహ్నం 12.301.50 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5.20 గంటల వరకు మూడు షిఫ్ట్‌లలో నిర్వహించనున్నారు. **స్టాఫ్ నర్స్ కోసం హాజరయ్యే అభ్యర్థులకు మెడికల్ బోర్డు కీలక సూచనలు జారీచేసింది.** 1. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, A4 సైజు పేపర్‌పై ప్రింటవుట్ తీసుకోవాలి. అభ్యర్థి ఫొటో, సంతకం ఉంటేనే హాల్ టికెట్ పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. 2. పరీక్ష హాల్/సెంటర్‌లోకి ప్రవేశించడానికి తప్పనిసరిగా హాల్ టికెట్‌ను సమర్పించాలి. 3.హాల్ టికెట్ పై ఫొటో లేదా సంతకం లేకపోతే అభ్యర్థి తప్పనిసరిగా 3 పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో పాటు గెజిటెడ్ అధికారి సంతకం చేసిన హాల్ టికెట్ తీసుకురావాలి. వీటిని పరీక్ష హాల్‌లోని ఇన్విజిలేటర్‌కు సమర్పించాలి. ఇలా చేయకపోతే అభ్యర్థిని పరీక్షకు అనుమతించరు. 4.అభ్యర్థులు ఏదైనా ఒక ఒరిజినల్ గుర్తింపు కార్డును కూడా తీసుకురావాలి. ప్రభుత్వం జారీ చేసిన (పాస్‌పోర్ట్ / పాన్ కార్డ్/ ఓటర్ ఐడీ/ ఆధార్ కార్డ్/ ప్రభుత్వ ఉద్యోగి ID/ డ్రైవింగ్ లైసెన్స్)

మిగతా 2 లో

jayabheridaily.com
ప్రభాత జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఆగస్ట్ 2న స్టాఫ్ నర్సు రాత పరీక్ష

పరీక్ష కేంద్రంలో అధికారులకు చూపించాలి. 5.అభ్యర్థులు ఎగ్జామ్ సెంటర్‌కు రిపోర్టింగ్ సమయానికి ద్వారా చేరుకోవాలి. అభ్యర్థుల నమోదుకు సమయం పడుతుంది. 6.రిజిస్ట్రేషన్‌లో అభ్యర్థుల బయోమెట్రిక్ సమాచారాన్ని తీసుకుంటారు. కాబట్టి అభ్యర్థులు చేతులపై మెహందీ, సిరా, టాటూస్ లేకుండా చూసుకోవాలి. 7.గేట్ మూసివేసిన తర్వాత అభ్యర్థులను పరీక్ష హాలులోకి అనుమతించరు. ఒక నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను అనుమతించరు.

**మొదటి సెషన్ :** రిపోర్టింగ్ సమయం 7.30 AM, గేట్ మూసివేసే సమయం 8.45 AM, పరీక్ష ప్రారంభ సమయం 9.00 AM

**రెండో సెషన్ :** రిపోర్టింగ్ సమయం 11.00 AM, గేట్ మూసివేసే సమయం 12.15 PM, పరీక్ష ప్రారంభ సమయం 12.30 PM

**మూడో సెషన్:** రిపోర్టింగ్ సమయం 2.30 PM, గేట్ మూసివేసే సమయం 3.45 PM , పరీక్ష ప్రారంభ సమయం 4.00 PM

8. అభ్యర్థులు కేటాయించిన కేంద్రం, సెషన్‌లో మాత్రమే పరీక్ష రాయాలి. పరీక్ష కేంద్రం, సెషన్ మార్పు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు. 9.అభ్యర్థులు తమ సంబంధిత కేంద్రాలను ముందురోజు ఒకసారి సందర్శించాలని అధికారులు సూచించారు. పరీక్ష రోజున పరీక్షా కేంద్రం కోసం వెతకకుండా ఉండేందుకు ముందు రోజు చెక్ చేసుకోవాలని సూచించారు. 10. అభ్యర్థి పరీక్ష రాసేందుకు హాల్ టికెట్, బ్లాక్/బ్లూ బాల్ పాయింట్ పెన్ మాత్రమే తీసుకెళ్లాలి. పరీక్షా కేంద్రం లోపలకు ఇతర గుర్తింపు కార్డులు, ఏదైనా వస్తువులు అనుమతించరు. అభ్యర్థులు వాటర్ బాటిల్ తెచ్చుకోవచ్చు. పరీక్ష హాలులో రఫ్ షీట్లను ఇన్విజిలేటర్ అందజేస్తారు. 11. అభ్యర్థులు కాలిక్యులేటర్లు, గణిత పట్టికలు, పేజర్లు, తీసుకురావడానికి అనుమతి లేదు. సెల్ ఫోన్లు, టాబ్లెట్‌లు, పెన్ డ్రైవ్‌లు, బ్లూటూత్ పరికరాలు, వాచ్, లాగ్ టేబుల్స్, వాలెట్, హ్యాండ్ బ్యాగ్‌లు, రైటింగ్ ప్యాడ్‌లు, నోట్స్, చార్ట్‌లు, లూజ్ షీట్‌లు లేదా ఏదైనా ఇతర గాడ్జెట్‌లు లేదా రికార్డింగ్ సాధనాలు తీసుకురా కూడదు. 12. అభ్యర్థి చెప్పులు మాత్రమే ధరించాలని అధికారులు సూచించారు. 13.విలువైన వస్తువులను సురక్షితంగా ఉంచడానికి పరీక్ష హాల్ వెలుపల సౌకర్యాలు ఉండకపోవచ్చు. కాబట్టి అభ్యర్థులు విలువైన పరికరాలు లేదా వ్యక్తిగత వస్తువులు తీసుకురావద్దని సూచించారు. 14. అభ్యర్థులు ఈ నియమాలు పాటించకపోతే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో F.I.R నమోదు చేయడమే కాకుండా, అభ్యర్థిపై అనర్హత వేటు వేస్తారు. 15.పరీక్ష మొత్తం వ్యవధి 80 నిమిషాలు. 80 నిమిషాల సమయం ముగిసిన తర్వాత ఎగ్జామ్ ఆటోమెటిక్ సబ్మిట్ అవుతుంది. ఎగ్జామ్ ఇంగ్లిష్ ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు. 16.అభ్యర్థులు పరీక్ష ముగిసే వరకు హాలు నుంచి బయటకు వెళ్లడానికి అనుమతించరు. 17. తుది ప్రక్రియ పూర్తి అయ్యే వరకు హాల్ టికెట్‌ను తప్పనిసరిగా భద్రపరుచుకోవాలి.

**ఖమ్మంలో ఒక పరీక్షా కేంద్రం మార్పు**

రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ఖమ్మం పట్టణంలో ప్రియదర్శిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ & టెక్నాలజీ (మహిళ) కాలేజీ పరీక్ష నిర్వహించడం సాధ్యపడకపోవడంతో... ఈ పరీక్ష కేంద్రంలోని అభ్యర్థులకు స్వర్ణ భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఖమ్మం ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ & సైన్స్ కేంద్రాలకు మార్చారు. ఈ అభ్యర్థుల హాల్ టికెట్ల నెంబర్లు అదేవిధంగా ఉంటాయని తెలిపారు. సంబంధిత అభ్యర్థులకు SMS, మెయిల్ ద్వారా పరీక్ష కేంద్రం మార్పులను తెలియజేశామని అధికారులుతెలిపారు.

# అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు



**జయభేరి, హైదరాబాద్ :**

రాష్ట్రంలో కనివిని ఎరుగని రీతిలో కుండపోత వర్షాలు కురిశాయి. వరద ముంపు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులు, సహాయ, పునరావాస చర్యలపై సీఎం కేసీఆర్ పర్యవేక్షిస్తున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి మూడో ప్రమాద హెచ్చరిక నేపథ్యంలో అధికారులకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. వరద పరిస్థితిపై మూడో రోజూ సీఎం కేసీఆర్ పర్యవేక్షించారు. రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో మంత్రులను, ప్రజాప్రతినిధులను, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో కొనసాగుతున్న సహాయ, పునరావాస కార్యక్రమాలపై ఆరా తీస్తూ... క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకున్నారు. పలు ముంపు, వరద ప్రభావిత ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులకు అనుగుణంగా సహాయక చర్యలు కొనసాగించాలని ఫోన్లో ఆదేశించారు. వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సీఎం కేసీఆర్ ఆదేశించారు. రక్షణ చర్యల కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేస్తున్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాలను అనుసరించి అన్ని రకాల చర్యలను చేపడుతూ ముంపునకు గురైన ప్రాంతాల్లో హెలికాప్టర్లు ద్వారా ఆహారం, తాగునీరు. మందులను అందించేలా సీఎస్ సహా ప్రభుత్వ ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

**మంత్రులకు ఆదేశాలు**

గత వారం రోజులుగా ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో వరదలు కొనసాగుతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో వానలు తగ్గుముఖం పట్టాయి. ఈ మేరకు అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసుకుంటూ, సహాయక చర్యల కొనసాగించాలని మంత్రులకు సీఎం కేసీఆర్ ఆదేశాలు జారీ చేశారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి కేటీఆర్ జీహెచ్ఎంసీ పరిధిలో పురపాలకశాఖ ఉన్నతాధికారులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ముంపు కాలనీలు, మూసీ పరివాహక ప్రాంతంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పారిశుద్ధ్య నిర్వహణ, సురక్షిత తాగునీటి సరఫరాకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ముంపునకు గురైన వైద్య సేవలపై సీఎం కేసీఆర్ మంత్రి హరీశ్ రావుకు ఫోన్ చేసి పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. సీఎం ఆదేశాలతో ఇప్పటికే వైద్యశాఖలో ఉద్యోగుల సెలవులు రద్దు చేశారు. ప్రజలకు వైద్యసేవలు అందించడంలో సిబ్బంది నిగమ్నమయ్యేలా చర్యలు తీసుకున్నారు. వైద్య సేవలపై ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్ష చేస్తున్న మంత్రి హరీష్ రావు, ఆస్పత్రుల్లో, పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న వైద్య పరీక్షలు, మందులు సరఫరా పరిస్థితిని సీఎంకు ఫోన్లో వివరించారు.

**భద్రాచలంలో పరిస్థితిపై ఆరా**

ఎగువన గోదావరి ప్రాంతంలో వరద ఉధృతి కొనసాగుతుండటంతో భద్రాచలంలో పరిస్థితిపై ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఫోన్లో మాట్లాడి పరిస్థితి తెలుసుకున్నారు. సీఎం ఆదేశాల మేరకు భద్రాచలం ప్రాంతంలో ఏరియల్ సర్వే చేసిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరించారు. ముంపు ప్రాంతాల నుంచి ఇప్పటి వరకు 12 వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించి, ఆహారం, వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో ఏకధాటిగా కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో అధికారులతో కలిసి జరిగిన నష్టాన్ని అంచనావేస్తూ, యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలని కేసీఆర్, మంత్రి సత్యవతి రాథోడ్ ను ఫోన్లో ఆదేశించారు. సీఎం ఆదేశాలతో మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల కలెక్టర్లు ఎస్పీలు, ఆర్ అండ్ బీ అధికారులతో మంత్రి టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ములుగు జిల్లాలోని పస్రా నుంచి ఏటూరు నాగారం వైపు వెళ్లే గుండ్ల వాగు రోడ్డు పునరుద్ధరణ పనులను పరిశీలించారు.

**ఇరిగేషన్ శాఖకు ఆదేశాలు**

ఎగువ నుంచి గోదావరికి వరద పెరగడంతో భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ఈ నేపథ్యలో వరద ముంపును తగ్గించే చర్యలు చేపట్టాలని, ఈ మేరకు ఇన్ ఫ్లో ను ముందస్తు అంచనా వేసి, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ.. నీటిని కిందికి వదలాలని చీఫ్ ఇంజనీర్లకు సీఎం కేసీఆర్ ఫోన్ ద్వారా ఎప్పటికప్పుడు ఆదేశాలిచ్చారు.

# భాగ్యనగరానికి జ్వరమొచ్చింది

## దవాఖానాలకు క్యూకడుతున్న ప్రజలు

**జయభేరి, హైదరాబాద్ :**

హైదరాబాద్ లో వైరల్ ఫీవర్స్ పెరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా ఇటీవల భారీ వర్షాలు కురిశాయి. గత రెండ్రోజులుగా వర్షాలు కాస్త తగ్గినా... మరో మూడు రోజుల పాటు వర్ష సూచన చెప్పింది వాతావరణ శాఖ. భారీ వర్షాల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న హైదరాబాద్ ను సీజనల్ వ్యాధులు చుట్టుముట్టాయి. నగరంలో ఒక్కసారిగా వైరల్ ఫీవర్స్ పెరిగాయి. భాగ్యనగరంలోని ప్రభుత్వ దవాఖానాలో రోగుల సంఖ్య పెరుగుతోంది. గ్రేటర్ పరిధిలోని ఆసుపత్రులకు జ్వరాలతో ప్రజలు క్యూకడుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో భాగ్యనగరంలో సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయని వైద్యారోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్ లోని ఉస్మానియా, గాంధీ ఆసుపత్రి, ఫీవర్, నిమ్స్ ఆసుపత్రులకు రోగుల తాకిడి పెరిగింది. ఒక్కో ఆసుపత్రిలో 500 పైగా ఓపీల సంఖ్య పెరిగిందని సమాచారం. జ్వరం, జలుబు, దగ్గు లక్షణాలతో రోగులు ఆసుపత్రులకు వస్తున్నారు. గత 10 రోజుల వ్యవధిలో డెంగీ, మలేరియా కేసులు పెరిగాయని వైద్యులు తెలిపారు.

**దవాఖానాలకు క్యూకడుతున్న ప్రజలు**

హైదరాబాద్ లో వాతావరణం మారడంతో... ప్రజలు జ్వరం, దగ్గు, తలనొప్పి అంటూ ఆసుపత్రుల్లో చేరుతున్నారు. మరోవైపు భాగ్యనగరంలో భారీగా కురిసిన వర్షాల కారణంగా రోజుల తరబడి చాలా కాలనీలు నీళ్లలోనే ఉన్నాయి. నీరు నిల్వ ఉండడంతో దోమలు విపరీతంగా పెరిగిపోయి జ్వరం, జలుపు, దగ్గు, డెంగీ, టైఫాయిడ్, మలేరియా వంటి ప్రమాదకర సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కాచిన నీరు తాగాలని వైద్యులు చూస్తున్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు, మస్కిటో రిపెల్లెంట్స్ వినియోగించాలని సూచిస్తున్నారు. భారీ వర్షాల తర్వాత హైదరాబాద్ వాసులను సీజనల్ వ్యాధులు భయపెడుతున్నాయి. ముఖ్యంగా బస్తీల్లో ఆరోగ్యం పడకేసింది. అధికారులు పట్టించుకోవట్లేదని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. బస్తీల్లో దోమలు విపరీతంగా పెరిగిపోయి జ్వరం, జలుబు, దగ్గుతో ఇతర సీజనల్ వ్యాధులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

**పెరుగుతున్న కండ్ల కలక కేసులు**

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయి. ప్రస్తుతం జ్వరాలతో పాటు కండ్లకలక సమస్య అధికంగా ఉంది. తేమతో కూడిన వాతావరణం వల్ల కంటి సమస్యలు ఎక్కువ అవుతున్నాయని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం దిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర, ఈశాన్య రాష్ట్రాలలో ఎక్కువగా కండ్లకలక కేసులు నమోదు అవుతున్నాయి. మహారాష్ట్రలోని ఓ గ్రామంలో ఐదు రోజుల్లోనే 2,300 కండ్లకలక కేసులు నమోదయ్యాయి. దక్షిణాది రాష్ట్రాల్లో కూడా కండ్ల కలక కేసుల మొదలయ్యాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కంటి శుభ్రత పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.



# పర్యావరణ రక్షణకు పెద్ద పులి పాత్ర అత్యంత కీలకం

### పులులను మనం కాపాడితే, అవి అడవిని తద్వారా మనల్ని కాపాడుతాయి

### అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్.ఎం. డోబ్రియల్



**జయభేరి, హైదరాబాద్ :**

ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి కార్యక్రమం హైదరాబాద్ (ములుగు) ఫారెస్ట్ కాలేజీ, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ లో ఘనంగా జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా మారిన వాతావరణ పరిస్థితులు, పర్యావరణ రక్షణకు ముప్పుగా మారాయని, ఉన్న అడవుల సంరక్షణ మాత్రమే దీనికి అనువైన పరిష్కారమని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్ & హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్.ఎం. డోబ్రియల్ అన్నారు. అడవుల రక్షణకు పులుల ప్రాధాన్యతే కీలకం అని, పులులను మనం కాపాడితే, అవి అడవినీ, తద్వారా ప్రజలను కాపాడుతాయని అన్నారు. ఈ విషయం ప్రతీ ఒక్కరూ గ్రహించి, ఇతరులనూ చైతన్యవంతం చేయాలన్నారు. ప్రాజెక్ట్ టైగర్ కార్యక్రమం ద్వారా దేశ వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమాలు పులుల సంఖ్య పెరిగేందుకు దోహద పడ్డాయని, ప్రస్తుతం దేశంలో 3,167 పులులు ఉన్నాయని తెలిపారు. అడవికి రాజులా పులి వ్యవహార శైలి, ప్రవర్తన గురించి ఆసక్తికరమైన విషయాలను ఈ సందర్భంగా పీసీసీఎఫ్ వెల్లడించారు.తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యతతో అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వుల్లో తీసుకున్న సంరక్షణ చర్యల వల్ల పులుల సంఖ్య బాగా పెరిగిందని, రానున్న రోజుల్లో మరింతగా పులుల ఆవాసాలను అభివృద్ధి చేస్తామన్నారు. అటవీ ప్రభావిత గ్రామాల పరిసరాల్లో జంతువులు, మనుషుల మధ్య సంఘర్షణ నివారణకు కృషి చేస్తున్నామన్నారు. పులుల ఆవాసాల్లో అలజడిని తగ్గించేందుకు కోర్ ఏరియాల్లో ఉన్న గ్రామాల తరలింపు ప్రక్రియను చేపట్టామని తెలిపారు.ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయం మేరకు భవిష్యత్ పర్యావరణవేత్తలను తీర్చిదిద్దుతున్న ఫారెస్ట్ కాలేజీ, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ లో రాష్ట్ర స్థాయి టైగర్ డే నిర్వహించటం శుభ పరిణామని డీన్ ప్రియాంక వర్గీస్ అన్నారు. అటవీ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఈ కార్యక్రమం అత్యంత ఉపయోగకరం అని అన్నారు. రాష్ట్ర స్థాయి అటవీ అధికారులు, ఉద్యోగులు, ఫారెస్ట్ కాలేజీ, ఫారెస్ట్ అకాడమీ (దూలపల్లి) నుంచి ట్రెయినీలు మొత్తం నాలుగు వందల మంది టైగర్ డే ఉత్సవాల్లో పాల్గొన్నారు. టైగర్ థీమ్‌గా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులు, ఉద్యోగులకు బహుమతులను అందించారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వుల అభివృద్ధి, పురోగతిపై ఫీల్డ్ డైరెక్టర్లు వినోద్ కూమార్, క్షితిజలు కార్యక్రమంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. పులుల రక్షణ కోసం అటవీశాఖ తీసుకుంటున్న చర్యలపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ఫారెస్ట్ కాలేజీలో కొత్తగా ప్రారంభిస్తున్న ఎం.ఎస్సీ (వైల్డ్ లైఫ్) బ్రోచర్ ను కార్యక్రమంలో ఆవిష్కరించారు. హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ తరపున ఇమ్రాన్ సిద్ధికీ తాము పులుల సంరక్షణ కోసం చేస్తున్న పనులను సమావేశంలో వివరించారు.కార్యక్రమంలో పీసీసీఎఫ్ (విజిలెన్స్) ఏలూసింగ్ మేరు, అడిషనల్ పీసీసీఎఫ్ (ఐ.టీ) వినయ్ కుమార్, సీసీఎఫ్ రామలింగం, హైదరాబాద్ సీసీఎఫ్ సైదులు, ఫారెస్ట్ అకాడెమీ డైరెక్టర్ ఆశ, ఫారెస్ట్ కాలేజీ అధికారులు శ్రీనివాస రావు, వెంకటేశ్వర్లు, నర్సింహారెడ్డి, తదితరులు హాజరయ్యారు.

# లోన్ యాప్ వేధింపులకు ప్రాణం బలి



**జయభేరి, కరీంనగర్ :**

లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులకు మరో యువకుడు బలైయ్యాడు. కరీంనగర్ కు చెందిన యువకుడు లోన్ యాప్ డబ్బులు తిరిగి చెల్లించకపోవడంతో... నిర్వాహకులు అతడిని వేధించారు. దీంతో అతడు సూసైడ్ చేసుకున్నాడు. ఆన్ లైన్ లోన్ యాప్ ఆగడాలు మళ్లీ పెరుగుతున్నాయి. లోన్ యాప్ నిర్వాహకుల వేధింపులతో కరీంనగర్ కు చెందిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ కు చెందిన నరేష్ శంషాబాద్ ఎయిర్ పోర్టులో పనిచేస్తున్నాడు. ఆన్ లైన్ లోన్ యాప్‌ల్లో డబ్బులు తీసుకున్న నరేష్, సమయానికి తిరిగి డబ్బులు చెల్లించలేకపోయాడు. దీంతో లోన్ యాప్ నిర్వాహకులు నరేష్ ను వేధింపులకు గురిచేశారు. నరేష్ కాంటాక్ట్స్ లోని నెంబర్లకు అసభ్యకరంగా మెసేజ్ పంపి వేధింపులు మొదలుపెట్టారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన నరేష్ , తాను ఉంటున్న హాస్టల్ లో విషం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన హాస్టల్ నిర్వాహకులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

**అసలేం జరిగింది?**

శంషాబాద్ ఎయిర్ పోర్టులోని ఒక ప్రైవేట్ సంస్థలో పనిచేస్తున్న నరేష్.... అక్కడికి దగ్గర్లోని ఆర్బీనగర్‌లో బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. నరేష్ ఫోన్‌కు గతంలో ప్రైవేట్ లోన్ యాప్ ద్వారా ఓ మెసేజ్ వచ్చింది. దీనికి స్పందించిన అతడు ఆ యాప్ నుంచి లోన్ తీసుకున్నాడు. లోన్ తిరిగి చెల్లించడంలో ఆలస్యం అవ్వడంతో... లోన్ యాప్ నిర్వాహకులు వేధింపులు స్టార్ట్ చేశారు. అతడి ఫోన్‌లో ఉన్న కాంటాక్ట్స్ కు అసభ్యకరంగా మెసేజ్‌లు పంపించారు. నరేష్ లోన్ యాప్ డబ్బులు తిరిగి చెల్లించలేదని, దానికి బదులుగా అతని ఇంట్లో ఆడవాళ్లని కావాలంటే పంపిస్తానని చెబుతున్నట్టుగా అసభ్యకరంగా మెసేజ్ పంపారు. ఈ మెసేజ్ చూసి కుంగిపోయిన నరేష్... విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నరేష్ చనిపోయిన తర్వాత కూడా అతడి ఫోన్‌కి యాప్ నిర్వాహకులు కాల్ చేశారు. ఫోన్ రిసీవ్ చేసుకున్న పోలీసులు.. నరేష్ ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పడంతో లోన్ యాప్ నిర్వాహకులు ఫోన్ వెంటనే కట్ చేశారు. నరేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు... నరేష్ ఆత్మహత్యకు కారకులైన నిందితులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. లోన్ యాప్ మాయగాళ్ల వలలో పడి ప్రాణాలు పోగొట్టుకోవద్దని పోలీసులు సూచిస్తున్నారు.

**యువతి ఫొటోలు మార్ఫింగ్ చేసి**

నెల్లూరు జిల్లాలో లోన్ యాప్ నిర్వాహకులు రెచ్చిపోయారు. ఓ యువతి ఫొటోలు మార్ఫింగ్ చేసి వేధింపులకు దిగారు. మార్ఫింగ్ చేసిన ఫొటోలను యువతి కాంటాక్ట్స్ కు పంపించి మానసికంగా వేధించారు. నెల్లూరు జిల్లా కోవూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న ఓ యువతికి వారం రోజుల క్రితం రూ. 3 వేలు అవసరమై ఆన్లైన్ లో లోన్ యాప్ లను సెర్చ్ చేసి క్యాండీ క్యాష్, ఈజీ మనీ యాప్ లలో తన వివరాలు నమోదు చేసింది. ఈ రెండు లోన్ యాప్ ల నుంచి రూ.3,700 యువతి బ్యాంక్ అకౌంట్లో క్రెడిట్ అయ్యాయి. అయితే మూడు రోజుల తరువాత అప్పుగా తీసుకున్న అమౌంట్ ను యువతి తిరిగి లోన్ యాప్ లకు చెల్లించింది. యువతి తీసుకున్న అమౌంట్ లోన్ యాప్ లకు చెల్లించినా... ఇంకా కట్టాలని లోన్ యాప్ నిర్వాహకుల నుంచి బెదిరింపు కాల్స్ మొదలయ్యాయి.

తాము అడిగిన డబ్బు కట్టకపోతే తన ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియా పెడతామని, బంధువులకు పంపించి పరువు తీస్తామని యువతిని బెదిరించారు. శుక్రవారం యువతి ఫోన్ ను హ్యాక్ చేసిన యాప్ నిర్వహకులు... మార్ఫింగ్ చేసిన యువతి ఫొటోలను ఆమె కాంటాక్ట్ నెంబర్లకు పంపించారు. దీంతో ఏం చేయాలో అర్థంకాక, మనోవేదనకు గురైన బాధిత యువతి చివరకు దిశ యాప్ లో SOSకు కాల్ చేసి సాయం కోరింది. బాధిత యువతి ఫిర్యాదుతో పోలీసులు లోన్ యాప్ నిర్వహకులపై కేసు నమోదు చేశారు. సైబర్ పోలీసులు కూడా లోన్ యాప్ నిర్వాహకుల వివరాలు సేకరిస్తున్నారు.

# ఏబీవీపీ కథనభేరి

### దగాపడ్డ విద్యార్థి మార్పు కోసం మహా ఉద్యమం

### విద్యారంగాన్ని విధ్వంసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**జయభేరి, హైదరాబాద్ :**

శనివారం నాడు ఏబీవీపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హోటల్ హరిత ప్లాజా బేగంపేట్ మీడియా సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కమల్ సురేష్ మాట్లాడుతూ 1200 మంది అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడ్డ తెలంగాణ ఏక కుటుంబ పాలనలో దగబడిందని రాష్ట్రం వస్తే మా బిడ్డలకు ఉద్యోగాలు వస్తాయి ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని తెలంగాణ ప్రజానీకం ఆశించింది.రాష్ట్రమైతే వచ్చింది కానీ తెలంగాణ ప్రజల బ్రతుకుల్లో మార్పు రాలేదు.నిరంకుశ కుటుంబ పాలనలో తెలంగాణ తల్లి బందీ అయింది.శతాబ్ది కాలంలో విద్యారంగం పూర్తిగా విధ్వంసం అయింది .కేజీ టు పీజీ ఉచిత నిర్బంధ విద్య అన్న ముఖ్యమంత్రి వాగ్దానం నినాదంగానే మిగిలింది. నిధులు లేక నియామకాలు చేపట్టగా తెలంగాణ విద్య వ్యవస్థ చిన్న భిన్నమైంది.2014లో అధికారంలోకి వచ్చిన నాడు విద్యారంగానికి 11% నిధులు కేటాయిస్తే నేడు ఆరు శాతానికి తగ్గించి విద్య విధ్వంసానికి రాష్ట్ర ప్రభుత్వం కూడా చేస్తుంది.15 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.రాష్ట్రంలో 8,624 ప్రభుత్వ పాఠశాలలు మూసివేసింద్రు,6,800 ప్రాథమిక పాఠశాలకు ఒకరే టీచర్,596 బంధి అయిన తెలంగాణ తల్లి విముక్తికై దగాపడ్డ తెలంగాణ విద్యార్థి మార్పు కోసం మహా ఉద్యమం కదనభేరి పేరుతో ఆగస్టు ఒకటి సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో లక్షలాదిమంది విద్యార్థులతో భారీ బహిరంగ సభను నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి విద్యార్థులు నిరుద్యోగులు కళాకారులు సబ్బండవర్గాల ప్రజలు వచ్చి విజయవంతం చేయాలని ఏబీవీపీ కోరుతుందని తెలియజేశారు.

## నాయకుల్లారా బూటకపు మాటలు మానీ..

# ప్రజల సమస్యలు పరిష్కరించండి

**జయభేరి, మేడిపల్లి :**



పీర్జాదిగూడ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు విలేకర్ల సమేషంలో మాట్లాడుతూ... BRS పార్టీ ప్రెస్ మీట్ పెట్టి పీర్జాదిగూడ కార్పొరేషన్ భారతీయ జనతా పార్టీ పై అన్ని అసత్య మాటలు మాట్లాడినారు. మా భారతీయ జనతా పార్టీ నాయకులు అందరం 28/7/2023 రోజున పీర్జాదిగూడ కార్పొరేషన్ లోని 16వ డివిజన్లో ఉన్న RTC కాలనీలో వరద వచ్చినా ప్రాంతాలను సందర్శించి అలాగే ప్రజలు ఈ వరద నీటితో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకోవాలని ఆ రోజు మా పార్టీ తరపున ఆ డివిజన్లోని పర్యటించడం జరిగింది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్య గురించి మున్సిపల్ కార్పొరేషన్ అధికారి D.E శ్రీనివాస్ అక్కడికి పిలిచి ఈ పరిస్థితిని పరిష్కరించడం ఎలా అని తనని అడిగినాము. అక్కడికి వచ్చిన D.E చెప్పిన... స్థానిక టిఆర్ఎస్ నాయకుడు ఆ అధికారి మాట కూడా వినకుండా తన ఇష్టం వచ్చినట్టు వ్యవహరించాడు. భారతీయ జనతా పార్టీ నాయకులు వచ్చి ఆ డివిజన్లో పర్యటించడం చూసి ఓర్వలేక మా మీద ఇష్టం వొచ్చిన మాటలు అని... మా నాయకుల పై దాడి చేసినాడు. కొద్ది మంది కార్పొరేటర్లు, BRS నాయకులు ప్రెస్ మీట్ పెట్టి బీజేపీ వాళ్లు దాడి చేసారని అసత్య ఆరోపణలు చేస్తూ మా పార్టీ పై బురద చల్లే ప్రయత్నం చేసినారు. మేము మహిళల మీద దాడి చేసాం అని మాట్లాడుతున్నారు. మా భారతీయ జనతా పార్టీ వాళ్ళము శ్రీపద కాలనీలోని రోడ్లను తొవ్వాలని ప్రయత్నాలు చేసాం అని.... మహిళలపై స్థానికుల నాయకుల పై దాడి చేశామంటూ అసత్య మాటలు చెబుతున్నారు. BRS నాయకులు బండి సతీష్, రఘువర్ధన్ రెడ్డి పై దాడి చేసాం అని నిందలు మోపడం సరికాదు అని, ఒక ప్రజా ప్రతినిధి అయిన కార్పొరేటర్ రమ్య మా భారతీయ జనతా పార్టీ మహిళ నాయకులను బూతు మాటలు తిడుతూ మా ఫోన్లను లాక్కోవడం జరిగింది. ఇది వారి అసహనానికి, అహంకారానికి ప్రతీక అని ప్రజలు తగిన బుద్ధి చెప్పుతారని భారతీయ జనతా పార్టీ తరపున తెలియజేస్తున్నాము. అలాగే పీర్జదిగుడా కార్పొరేషన్ లోని కార్పొరేటర్లకు.

BRS నాయకులకు ఒక విషయం తెలియజేస్తున్నాము. మా భారతీయ జనతా పార్టీ నాయకుల పై ఇంకోసారి అసత్య ప్రచారాలు చేస్తే వారికి తగిన రీతిలో బుద్ధి చెబుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో పీర్జాదిగూడ కార్పొరేషన్ అధ్యక్షుడు నమిలికొండ అనిల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాంపల్లి గిరి గౌడ్, జిల్లా యువమోర్చా అధ్యక్షుడు బండారు పవన్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జైపాల్ రెడ్డి, నాయకులు గీతారామ్, శాదగొండ కరుణాకర్ రెడ్డి, చిత్తరంజన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నవారు.



## నన్ను లైంగికంగా వేధించారు

### మాజీ మంత్రి నారాయణపై తమ్ముడి భార్య ఫిర్యాదు

తనను లైంగికంగా వేధించారని మాజీ మంత్రి నారాయణపై ఆయన తమ్ముడి భార్య కృష్ణప్రియ సంచలన ఆరోపణలు చేశారు. ఆ మేరకు ఆమె వీడియో కూడా విడుదల చేశారు. తాజాగా ఆమె ఈ విషయంపై పోలీసులను ఆశ్రయించారు. ఆదివారం హైదరాబాద్ రాయదుర్గం పోలీసు స్టేషన్‌కు వెళ్లిన ప్రియ.. మాజీమంత్రి నారాయణపై ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి నారాయణ.. తనను లైంగికంగా వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా నారాయణపై ప్రియ ఇన్‌స్టాగ్రామ్‌లో పలు వీడియోలు విడుదల చేస్తున్నారు. నారాయణ తనను వేధిస్తున్నారని, వీడియోలు విడుదల చేసిన తర్వాత ఆ వేధింపులు మరింత ఎక్కువయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. నారాయణ వేధింపులు తట్టుకోలేక తాను పోలీసులను ఆశ్రయించినట్టు తెలిపారు. గత ఎన్నికల సమయంలో తనను ప్రచారం చెయ్యాలని నారాయణ ఇబ్బంది పెట్టారని ప్రియ ఆవేదన వ్యక్తం చేశారు. తన కుటుంబాన్ని కూడా నారాయణ అనేక ఇబ్బందులు పెట్టారని ఆరోపించారు.

**29 ఏళ్లు నరకం**

ఇన్ స్టాగ్రామ్ లో ప్రియ విడుదల చేసిన వీడియో వైరల్ అయింది. ఈ వీడియోలో... తాను 29 ఏళ్లు భరించాను, ఇక భరించే శక్తి నాకు లేదని ఆవేదన చెందారు. సీతాదేవి కూడా 16 సంవత్సరాలు అరణ్యవాసం చేసిందని, కానీ నేను 29 ఏళ్లు నరకం అనుభవించాననన్నారు. ఇంటి విషయాలైనా, పబ్లిక్ విషయాలైనా, నారాయణ విద్యా సంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యల విషయాలపైనా బయట పెట్టేందుకు సిద్ధంగా ఉన్నానని ఆమె వీడియోలో పేర్కొన్నారు.

**నా భార్యకు మానసిక అనారోగ్యం**

సామాజిక మాధ్యమాల్లో తన భార్య కృష్ణ ప్రియ విడుదల చేసిన వీడియోలపై మాజీ మంత్రి నారాయణ సోదరుడు సుబ్రహ్మణ్యం స్పందించారు. తన భార్య కృష్ణప్రియ కొద్ది రోజులుగా మానసిక అనారోగ్యంతో బాధపడుతుందని తెలిపారు. ఆమె వారం రోజులుగా కొన్ని వీడియోలు వీసి సోషల్ మీడియాలో పెట్టారన్నారు. ఈ వీడియోలు తమ కుటుంబం పరువునకు భంగం కలిగించేలా ఉన్నాయన్నారు. 2017లో కృష్ణప్రియను సైక్రియాటిస్టుకు చూపించామన్నారు. అయినా వ్యాధి నయం కాకపోవడంతో 2019లో గుంటూరులో మరో సైక్రియాటిస్టుకు చూపించామని, అయినా రికవరీ కాలేదని తెలిపారు. తెలంగాణలోని మానస హాస్పిటల్, గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో కూడా ఆమెకు చికిత్స అందించామన్నారు. ఈ ఏడాది మేలో ప్రియకు క్యాన్సర్ అని వైద్యులు నిర్ధారించారన్నారు. యశోద ఆస్పత్రిలో ప్రియకు సర్జరీ చేశారని సుబ్రహ్మణ్యం తెలిపారు. ఇంకా కీమో థెరపీలు చేయిస్తున్నామన్నారు. ఇంకా తన భార్యకు చికిత్స ఇప్పిస్తూ జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. క్యాన్సర్ చికిత్స కారణంగా సైక్రియాటిస్టు మందులు నిలిపివేశామన్నారు. ఆమె పెడుతున్న వీడియోలు మానవతా కోణంలో పట్టించుకోవద్దని సుబ్రహ్మణ్యం కోరారు.



## భక్తులకు పంచిపెట్టే అపూర్వగట్టమే ఫలహార బండి

**జయభేరి, మేడిపల్లి :**

అమ్మవారులకు భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో సమర్పించే భోనం, ఫలహారాన్ని గ్రామంలోని వాడవాడనా అమ్మవారిని ఊరేగిస్తూ ఫలహారం పంచిపెట్టే అపూర్వ ఘట్టమే ఫలహార బండి ఊరేగింపు అని టిపిసిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. ఆషాడ బోనాల వేడుకల్లో భాగంగా మేడ్చల్ నియోజకవర్గం గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు సురేందర్ రెడ్డి, కీసర మండలం కుందన్ పల్లి గ్రామం ఎంపీటీసీ కిరణ్ జ్యోతి ప్రవీణ్, ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించి ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమానికి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గం కోఆర్డినేటర్ సుభాష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కీసర మండల అధ్యక్షులు కోళ్ల కృష్ణా యాదవ్, నాగారం మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాసరెడ్డి అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి, హరిబాబు గౌడ్, దమ్మైగూడ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిలర్ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవార్ల దయతో ప్రజలందరూ చల్లగా ఉండాలి

### టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి





**జయభేరి, ఘట్కేసర్ :**

ఘట్కేసర్ మండలం ఘణపురం, శామీర్ పేట మండలం అలియాబాద్, మేడ్చల్ మండలం గౌడవెల్లి గ్రామంలో గ్రామస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవార్లకు బోనాలను సమర్పించారు. ఈ బోనాల వేడుకలకు టిపిసిసి సీనియర్ అధికార ప్రతినిధి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి ఆయా గ్రామస్తుల ఆహ్వానం మేరకు హాజరై అమ్మవార్లకు సమర్పించే బోనాల కార్యక్రమాలలో, అమ్మవార్ల దేవాలయాలలో జరిగిన పూజా కార్యక్రమాలలో పాల్గొని అమ్మవార్ల దయతో ప్రజలందరూ చల్లగా ఉండాలని, సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమాలలో హరి వర్ధన్ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ అద్యక్షులు వేముల మహేష్ గౌడ్, శామీర్ పేట, తూంకుంట, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ గౌడ్, భీమిడి జైపాల్ రెడ్డి, గోమారం రమణారెడ్డి, గౌడవెల్లి, ఘణపురం గ్రామ సర్పంచులు గరిశల సురేందర్ ముదిరాజ్, బద్దం గోపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## 20 ఏళ్ల తరువాత తిరిగోచ్చాడు

**జయభేరి, మంచిర్యాల :**

10 సంవత్సరాల వయస్సు లో 20 ఏళ్ల క్రితం ముంబైలో తప్పిపోయిన బాలుడు 30 ఏళ్ల యువకుడై తిరిగి రావడంతో ఆ కుటుంబ సభ్యుల్లో ఆనంద వెల్లివిరిసింది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో సదరు యువకుడు తల్లితో పాటు కుటుంబ సభ్యులను కలుసుకోవడంతో వారు ఆనంద డోలికల్లో తేలియాడారు. ఉత్తరప్రదేశ్ లోని ఘాజీపూర్ జిల్లా తాసిల్ మొహందాబాద్ రఘువర్ గంజ్ గ్రామానికి చెందిన మహేందర్ బింద్ అనే బాలుడు ఐదవ తరగతి చదువుతున్న సమయంలో మహారాష్ట్రలోని ముంబైకి బంధువుల ఇంటికి వెళ్లి తప్పిపోయాడు.అప్పటి నుంచి అక్కడే పని చేస్తూ జీవనం సాగించాడు...ఈ క్రమంలో బెల్లంపల్లిలో ఓ బేకరీలో పనిచేస్తున్న శివకుమార్ యాదవ్ ముంబైకి వెళ్లడంతో అక్కడ మహేందర్ బింద్ కలిశాడు. పని కోసం బెల్లంపల్లిలోని మనీషా బేకరీకి తీసుకువచ్చాడు. మహేందర్ బింద్ అనే యువకుడు తనది ఘాజీపూర్ జిల్లా అని చెప్పడంతో శివ కుమార్ కూడా తనది ఉత్తరప్రదేశ్ అని చెప్పడంతో తన కుటుంబ సభ్యులు దొరుకుతారేమోనని ఆశపడ్డాడు. ఇదే సమయంలో శివ కుమార్ యాదవ్ ఘాజీపూర్ పోలీసులకు మహేందర్ బింద్ కోసం సమాచారంఅందించాడు...అడ్రస్ దొరకడంతో మహేందర్ బింద్ వివరాలను కుటుంబ సభ్యులకు చేరవేశారు. వెంటనే తల్లి సంత్ర బింద్ చిన్నమ్మ బసంత్ బింద్ బాబాయి కమలేష్ బింద్ గురువారం బెల్లంపల్లికి వచ్చారు.30 ఏళ్ల కుమారుడిని చూసి ప్రేమతో హత్తుకొని మురిసి పోయారు.శివ కుమార్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు...కుమారుని తీసుకొని బెల్లంపల్లి నుంచి 20 ఏళ్ల క్రితం ముంబైలో తప్పిపోయిన బాలుడు 30 ఏళ్ల యువకుడై తిరిగి రావడంతో ఆ కుటుంబ సభ్యుల్లో ఆనంద వెల్లివెరిసింది.బెల్లంపల్లిలో సదరు యువకుడు తల్లితో పాటు కుటుంబ సభ్యులను కలుసుకోవడంతో వారు ఆనంద డోలికల్లో తేలియాడారు. ఉత్తరప్రదేశ్ లోని ఘాజీపూర్ జిల్లా తాసిల్ మొహందాబాద్ రఘువర్ గంజ్ గ్రామానికి చెందిన మహేందర్ బింద్ అనే బాలుడు ఐదవ తరగతి చదువుతున్న సమయంలో మహారాష్ట్రలోని ముంబైకి బంధువుల ఇంటికి వెళ్లి తప్పిపోయాడు.అప్పటి నుంచి అక్కడే పని చేస్తూ జీవనం సాగించాడు.ఈ క్రమంలో బెల్లంపల్లిలో ఓ బేకరీలో పనిచేస్తున్న శివకుమార్ యాదవ్ ముంబైకి వెళ్లడంతో అక్కడ మహేందర్ బింద్ కలిశాడు. పని కోసం బెల్లంపల్లిలోని మనీషా బేకరీకి తీసుకువచ్చాడు. మహేందర్ బింద్ అనే యువకుడు తనది ఘాజీపూర్ జిల్లా అని చెప్పడంతో శివ కుమార్ కూడా తనది ఉత్తరప్రదేశ్ అని చెప్పడంతో తన కుటుంబ సభ్యులు దొరుకుతారేమోనని ఆశపడ్డాడు.ఇదే సమయంలో శివ కుమార్ యాదవ్ ఘాజీపూర్ పోలీసులకు మహేందర్ బింద్ కోసం సమాచారం అందించాడు.అడ్రస్ దొరకడంతో మహేందర్ బింద్ వివరాలను కుటుంబ సభ్యులకు చేరవేశారు. వెంటనే తల్లి సంత్ర బింద్ చిన్నమ్మ బసంత్ బింద్ బాబాయి కమలేష్ బింద్ గురువారం బెల్లంపల్లికి వచ్చారు.30 ఏళ్ల కుమారుడిని చూసి ప్రేమతో హత్తుకొని మురిసి పోయారు.శివ కుమార్ యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు.కుమారుని తీసుకొని బెల్లంపల్లి నుంచి రప్తి సాగర్ ఎక్స్‌ప్రెస్ రైలు లో ఉత్తర్ ప్రదేశ్ కు బయలుదేరి వెళ్లారు.రప్తి సాగర్ ఎక్స్‌ప్రెస్ రైలు లో ఉత్తర్ ప్రదేశ్ కు బయలుదేరి వెళ్లారు.

## కరీంనగర్ గ్రంథాలయం మహిళలకు మాత్రమే



**జయభేరి, కరీంనగర్ :**

రాను రాను మొబైల్ చేతికొచ్చి ప్రపంచాన్ని ఓ కుగ్రామంలా మార్చాక.. టీవీ, సినిమా, ఓటీటీ, వార్తలు, పత్రికలు, మ్యాగజైన్స్, గేమ్స్, ఆన్లైన్ షాపింగ్.. ఇలా ఏ అంశమైనా ఫోనే అయిపోయింది. దీంతో పుస్తక పఠనం పూర్తిగా పడిపోయింది. అన్నీ మొబైల్‌లోనే లభించే అవకాశాన్ని సాధించడం మనిషి సాధించిన సాంకేతికతకు ఓవైపు అద్దం పడుతుంటే.. మరోవైపు దానివల్ల చూపుకు, జ్ఞాపకశక్తికి, రేడియేషన్ తో ఏర్పడే శారీరక సమస్యలకు.. పిల్లలపై ప్రభావానికీ మొబైల్ వల్లే అంతే అనర్థాలనూ సమాంతరంగా చూస్తున్నాం. ఈ క్రమంలో పుస్తక పఠనం విలువ ఇప్పుడు మరోసారి డిబేటబుల్‌గా మారింది. ఈ అంశాన్నే కొలమానంగా తీసుకుని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయాలను మరోసారి తెరపైకి తెచ్చింది. అందులో పుస్తక పఠనంతో పాటు.. పూర్తిగా వైఫై కనెక్టివిటీతో డిజిటల్ లైబ్రరీలను తెరపైకి తేవడం అభినందించాల్సిన విషయం.అయితే, ఇప్పటివరకూ మనం చూసిన ఎన్నో లైబ్రరీలు కేవలం మగవారు మాత్రమే స్వేచ్ఛగా వెళ్లి చదువుకునేలా ఉండేవి. కానీ, అందుకు భిన్నంగా ఇప్పుడు మహిళల కోసం కూడా ప్రత్యేక గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తోంది. అందులో భాగంగా కరీంనగర్ జిల్లా రాంనగర్ కేంద్రంగా.. మొట్టమొదటిసారి ఏర్పాటు చేసిన మహిళా గ్రంథాలయం ఇప్పుడు చెప్పుకోవాల్సిన ఓ ప్రగతిశీల అంశం. ఈ లైబ్రరీకి ఇప్పుడు చుట్టుపక్కల మహిళలు పెద్ద ఎత్తున క్యూ కడుతున్నారు. మహిళలకు కావల్సిన అన్ని వసతులతో పాటు.. సావిత్రీభాయి పూలే, సరోజిని దేవీ, కల్పనా చావ్లా నుంచి మొదలుకుంటే ఇందిరాగాంధీ, మదర్ థెరిస్సా, సూపర్ హ్యూమన్ కంప్యూటర్ శకుంతలాదేవీ వరకు ఎన్నో స్ఫూర్తిదాయక పుస్తకాలు మహిళలకు అందుబాటులో ఉన్నాయి. అంతెందుకు.. మహిళలకిష్టమైన వంటలు, కుట్లు, అల్లికలు, గార్డెనింగ్, ఆరోగ్య సూత్రాలు, బ్యూటీషియన్ బుక్స్ తో పాటు.. నవలలు, చారిత్రక పుస్తకాల వంటివీ ఉంచడంతో చాలామంది మహిళలు.. తమ కుటుంబ పనులు ముగించుకుని కరీంనగర్ లో లైబ్రరీ బాట పట్టడం.. మహిళా సాధికారత సాధించాలనుకునే క్రమంలో ఓ ప్రోగ్రెసివ్ డెవలప్ మెంట్.అయితే, మొట్టమొదటి మహిళా లైబ్రరీని కరీంనగర్ వేదికగా ప్రారంభించిన తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం.. దాన్ని గ్రామగ్రామానికీ విస్తరించాలనుకుంటోంది. కరీంనగర్ లో ప్రస్తుతం మహిళాసంఘ భవనంలో నిర్వహిస్తున్న ఈ లైబ్రరీని.. ఐదు గదులతో.. పూర్తి స్థాయి ఫర్నీచర్ తో కోటి ఐదులక్షల రూపాయల వ్యయంతో నిర్మించేందుకు రంగం సిద్ధమైంది. ప్రతీనెలా వార్తాపత్రికలు, ఇతర మ్యాగజైన్స్ కోసం ప్రతీ రీడింగ్ రూమ్ కు ఒక రెండు వేల బడ్జెట్ నూ కేటాయిస్తున్నారు. ఇదే పద్ధతిలో గ్రామాల్లో గ్రామపంచాయతుల ఆధ్వర్యంలో ఇలాంటి మహిళా ఓపెన్ లైబ్రరీస్ ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# ఏదో అనుకుంటే.. ఇంకేదో జరిగింది..

## ముగ్గురు ఆటగాళ్ల ఫ్లాప్ షో



భారత్, వెస్టిండీస్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో విజయం సాధించి ఆత్మవిశ్వాసంతో ఉన్న టీమిండియా.. రెండో మ్యాచ్‌లో ఓడిపోయింది. ఈ ఓటమికి ప్రధాన కారణం టీమ్ ఇండియా బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పరాజయాలు చవిచూడడమే. భారత్ వర్సెస్ వెస్టిండీస్ రెండో వన్డేలో సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ మ్యాచ్‌కు దూరమై విశ్రాంతి తీసుకున్నారు. దీంతో జట్టులోని మిగతా వారిపై చాలా బాధ్యత ఉంది. ఈ బాధ్యతను సమర్థంగా నిర్వహించడంలో టీమ్ ఇండియా విఫలమవడంతో ఓటమికి దారి తీసింది. ఇంతకీ, ఈ మ్యాచ్‌లో పూర్తిగా విఫలమైన ముగ్గురు ప్రధాన ఆటగాళ్లు ఎవరు? రోహిత్ శర్మ గైర్హాజరీతో హార్దిక్ పాండ్యా టీమ్ ఇండియా కెప్టెన్సీ బాధ్యతలు తీసుకున్నాడు. అయితే టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ కు దిగిన హార్దిక్ కు తర్వాత కష్టాలు ఎదురయ్యాయి. తొలి వికెట్‌కు 90 పరుగులతో అద్భుతంగా ఆరంభించిన టీమ్‌ఇండియా మూడు ఓవర్ల వ్యవధిలో మూడు వికెట్లు కోల్పోవడంతో ఆ బాధ్యత హార్దిక్‌పై పడింది. అయితే ఈ బాధ్యతను నిర్వర్తించడంలో హార్దిక్ విఫలమయ్యాడు. హార్డ్ లెంగ్త్ డెలివరీ హార్దిక్‌కి మళ్లీ షాక్ ఇచ్చింది. అతను వికెట్ కోల్పోయాడు. హార్దిక్ పాండ్యా 14 బంతులు ఎదుర్కొని 7 పరుగులు మాత్రమే చేశాడు. చాలా కాలం తర్వాత ఈ మ్యాచ్‌లో సంజూ శాంసన్‌కు అవకాశం దక్కింది. సంజూ శాంసన్‌కు మొదటి మ్యాచ్‌లో అవకాశం దక్కకపోవడంతో సంజూ అభిమానులు పెద్ద ఎత్తున సంజూకు అవకాశం కల్పించాలని కోరారు. రెండో మ్యాచ్‌లో సంజుకు అవకాశం దక్కే అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. అయితే కోహ్లీ, రోహిత్ ఆడే జట్టుకు దూరంగా ఉండాలని నిర్ణయించుకోవడంతో ఈ మ్యాచ్‌లో సంజూ శాంసన్‌కు అవకాశం లభించింది. అయితే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో మరోసారి సంజూ శాంసన్ విఫలమయ్యాడు. శుభ్‌మన్ గిల్, ఇషాన్ కిషన్ 90 పరుగుల అద్భుత భాగస్వామ్యం అందించినా.. శాంసన్ 19 బంతులు ఎదుర్కొని 9 పరుగులు మాత్రమే చేయగలిగాడు. సంజూ ఈ వైఫల్యం కూడా టీమ్ ఇండియాకు ఎదురుదెబ్బ తగిలింది. ఉమ్రాన్ మాలిక్ ఫాస్ట్ బౌలర్‌గా ఎన్నో అంచనాలు నెలకొల్పాడు. అంతర్జాతీయ స్థాయిలో ఉమ్రాన్ మాలిక్ ఆశించిన ప్రదర్శన ఇప్పటి వరకు రాలేదు. తొలి మ్యాచ్‌లో కేవలం మూడు ఓవర్లు మాత్రమే వేసిన రెండో మ్యాచ్‌లో విలువైన పరుగులు ఇచ్చాడు. ఈ మ్యాచ్‌లోనూ ఉమ్రాన్ మూడు ఓవర్లు మాత్రమే వేసినా 27 పరుగులు ఇచ్చాడు. ఉమ్రాన్ మాలిక్‌ను కీలక ఆటగాడిగా చూస్తారు. అతనికి ప్రపంచ కప్ జట్టులో అవకాశం ఇవ్వాలని సెలక్షన్ బోర్డు ఆసక్తిగా ఉంది. కానీ అది సాధ్యం కావాలంటే, ఈ అవకాశాన్ని అద్భుతంగా ఉపయోగించుకోవాలి.

# అన్నీ మాకే తెలుసని అనుకుంటారు..



టీమిండియా ప్రస్తుత ఆటగాళ్లపై కొందరు మాజీలు అసంతృప్తిగా ఉన్నారు. భారత దిగ్గజం సునీల్ గవాస్కర్ ఇటీవల 'ఈగో' (అహం) కామెంట్ చేశారు. ఒకప్పుడు సచిన్ టెండూల్కర్, వీరేందర్ సెహ్వాగ్ లాంటి ఆటగాళ్లే క్లిష్ట సమయాల్లో ఉన్నప్పుడు సలహాల కోసం తనను సంప్రదించే వారని చెప్పారు. అయితే ప్రస్తుతం ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా.. టీమిండియా ప్రస్తుత ప్లేయర్లు.. మాజీలను సంప్రదించడం లేదని, వారికి అహం ఉన్నట్టు ఉందని గవాస్కర్ కామెంట్లు చేశారు. అయితే, ఈ విషయంపై భారత దిగ్గజం, 1983 ప్రపంచకప్ విన్నింగ్ కెప్టెన్ కపిల్‌దేవ్ తాజాగా స్పందించారు. గవాస్కర్ వ్యాఖ్యలను సమర్థిస్తూనే మాట్లాడారు. ప్రస్తుత ఆటగాళ్లు అన్నీ తమకే తెలుసుననే భావనలో ఉన్నారని కపిల్‌దేవ్ అన్నారు. ఐపీఎల్ వల్ల కెరీర్ ప్రారంభంలోనే ఎక్కువ డబ్బు వస్తుండడం వల్ల కొందరికి అహంకారం వస్తోందని ది వీక్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. "సానుకూలంగా చూస్తే ఈ ఆటగాళ్లు చాలా కాన్ఫిడెంట్‌గా ఉంటారు. నెగెటివ్ పాయింట్ పరిశీలిస్తే.. మాకే అన్నీ తెలునని వారు అనుకుంటారు. మేం ఆత్మవిశ్వాసంతో ఉన్నాం.. అందుకే ఎవరినీ ఏమీ అడగాల్సిన అవసరం లేదని అనుకుంటున్నారు. అయితే, అనుభవజ్ఞులు వారికి సాయం చేయగలరని నేను నమ్ముతున్నా" అని గవాస్కర్ అన్నారు. "కొన్నిసార్లు ఎక్కువ డబ్బు పొందడం వల్ల కూడా అహంకారం వస్తుంది. తమకే అన్నీ తెలుసునని ఈ క్రికెటర్లు అనుకుంటున్నారు. అదే తేడా. చాలా మంది క్రికెటర్లకు ప్రస్తుతం సాయం అవసరమని నేను అనుకుంటున్నా. అక్కడ సునీల్ గవాస్కర్ ఉన్నాడు. మీరు అతడితో ఎందుకు మాట్లాడరు? ఇందులో ఎలాంటి అహం ఉండదు. కానీ మేం అంతా బాగానే ఉన్నామని ఆటగాళ్లు అనుకుంటున్నారు. బహుశా వారు తగినంత బాగానే ఉండి ఉండొచ్చు. కానీ 50 సీజన్ల (సంవత్సరాలు) క్రికెట్ చూసిన వారి నుంచి అదనపు సాయం తీసుకోవాలి. అతడిని చాలా విషయాలు తెలుసు. కొన్నిసార్లు వినడం కూడా మీ ఆలోచనలను మార్చగలదు" అని గవాస్కర్ అన్నారు. 2013 చాంపియన్స్ ట్రోఫీ తర్వాత పదేళ్లుగా టీమిండియా ఒక్క ఐసీసీ టోర్నీ కూడా గెలువలేదు. ఐసీసీ టోర్నీల్లో కీలకమైన నాకౌట్ మ్యాచ్‌లో భారత ఆటగాళ్లు తడబడుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో జరిగిన టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్‌లోనూ భారత జట్టు పరాజయం పాలైంది. ఈ మ్యాచ్ ఓడిపోయిన తర్వాతే గవాస్కర్ 'ఈగో' కామెంట్ చేశారు. ఓ ఫోన్ కాల్ ద్వారా.. బ్యాటింగ్ మెరుగుపరుచుకునేందుకు సెహ్వాగ్‌కు అప్పట్లో హెల్ప్ చేశానని, కానీ ప్రస్తుత రోజుల్లో భారత ప్లేయర్లు మాజీల వద్ద అసలు సలహాలు తీసుకోవడం లేదని గవాస్కర్ అన్నారు. అప్పట్లో రాహుల్ ద్రవిడ్, సచిన్ టెండూల్కర్, వీవీఎస్ లక్ష్మణ్ కూడా తన వద్దకు వచ్చేవారని గుర్తు చేశారు.

# ఇంగ్లండ్‌ను చిత్తు చేసిన భారత మహిళల హాకీ జట్టు



ప్రధాన స్ట్రయికర్ లాల్‌రెమ్‌సియామి హ్యాట్రిక్ గోల్స్‌తో విజృంభించడంతో భారత మహిళల హాకీ జట్టు 30తో ఇంగ్లండ్‌ను చిత్తుచేసింది. స్పానిష్ హాకీ సమాఖ్య శత వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ టోర్నీలో భారత్‌కు ఇదే తొలి విజయం కాగా.. గత రెండు మ్యాచ్‌లను మన అమ్మాయిలు 'డ్రా' చేసుకున్నారు. భారత్ తరపున లాల్‌రెమ్‌సియామి (13వ, 17వ, 56వ నిమిషాల్లో) హ్యాట్రిక్ గోల్స్‌తో అదరగొట్టింది. మ్యాచ్ ఆరంభం నుంచే బంతిపై పూర్తి నియంత్రణ సాధించిన మనవాళ్లు.. ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగిపోయారు. ఆదివారం తమ చివరి లీగ్ మ్యాచ్‌లో స్పెయిన్‌తో భారత్ అమీతుమీ తేల్చుకోనుంది.

# తన మాట వింటూ అనువుగా ఉండే వాళ్లకు రేవంత్ అందలం?

హైదరాబాద్, జూలై 29



తన వ్యతిరేకులను రాష్ట్ర రాజకీయాల నుంచి తప్పించేందుకు టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పావులు కదుపుతున్నారా? తన మాట వింటూ అనువుగా ఉండే వాళ్లు ఇక్కడ ఉండేలా... అడ్డొచ్చే వాళ్లను ఢిల్లీకి పంపించేలా స్కెచ్ వేస్తున్నారా? అంటే ఈ ప్రశ్నలకు కాంగ్రెస్ పార్టీలో అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. పార్టీలో తన ఆధిపత్యానికి అడ్డులేకుండా చూసుకొనేందుకు రేవంత్‌రెడ్డి ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలుపెట్టినట్టు సమాచారం. ఇందుకు రాబోయే ఎన్నికలనే అస్త్రంగా మార్చుకొన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. తన మాట వింటూ తనకు అనువుగా ఉండే వాళ్లను ఎమ్మెల్యేలుగా పోటీ చేయించి, రాష్ట్ర రాజకీయాల్లో ఉండేలా..తనకు వ్యతిరేకంగా పనిచేస్తూ అడ్డొచ్చే వాళ్లను ఎంపీలుగా పోటీ చేయించి ఢిల్లీకి పంపించేలా భారీ స్కెచ్ సిద్ధం చేస్తున్నట్టుతెలిసింది.ఈజాబితాలోఉత్తమ్‌కుమార్‌రెడ్డి ,కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్ ఉన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇందుకు అనుగుణంగానే టికెట్ల కేటాయింపు జాబితాను సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. సీనియర్ నేతలకు చెక్‌పెట్టేందుకుగానూ రేవంత్ 'ఒకే కుటుంబం ఒకే టికెట్' నినాదాన్ని మరింత బలంగా అమలుచేసేలా అధిష్ఠానంపై ఒత్తిడి చేసే ప్రయత్నం చేస్తున్నట్టు తెలిసింది. ఇదే జరిగితే తొలిదెబ్బ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై పడనున్నది. గతంలో హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో ఆయన, ఆయన భార్య పద్మావతి ఎమ్మెల్యేలుగా ఉన్నారు. గత ఎన్నికల్లో ఉత్తమ్ నల్గొండ ఎంపీగా గెలువగా, ఆయన భార్య పద్మావతి హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు.

ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో పద్మావతి హుజూర్‌నగర్ ఎమ్మెల్యేగా, ఉత్తమ్ కోదాడ ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. దీన్ని రేవంత్‌రెడ్డి వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం. ఒకవేళ అధిష్ఠానం మెత్తబడితే ఉత్తమ్‌ను ఎంపీగానే పోటీ చేయించేలా ప్లాన్ చేస్తున్నట్టు తెలిసింది. ఇందులో భాగంగానే కోదాడలో ఇతర పార్టీలోని సీనియర్ నేత చేరికను ప్రోత్సహిస్తున్నట్టు ప్రచా రం జరుగుతున్నది. తనకు పార్టీలో పోటీవచ్చే నేతల్లో ముఖ్యుడైన సీఎల్పీ నేత భట్టి విక్రమార్కపైనా రేవంత్ దృష్టిపెట్టారు. భట్టి విక్రమార్కను ఎమ్మెల్యేగా ఓడించేలా పావులు కదుపుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఖమ్మం జిల్లాలో భట్టి విక్రమార్కకు చెక్‌పెట్టేందుకుగానూ తన సామాజిక వర్గమైన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని రంగంలోకి దించినట్టు ప్రచారం జరుగుతున్నది.

## డిగ్రీ కళాశాలలో ప్రవేశపెట్టిన నాలుగు సంవత్సరాల నూతన విద్యా విధానం-అవగాహన సదస్సు

నంద్యాల :

స్థానిక నంద్యాల పట్టణంలోని శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఈరోజు అనగా 29 7 2023న డిగ్రీ కళాశాలలో నాలుగు సంవత్సరాల నూతన విద్యా విధానం అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సు కు కళాశాల చైర్మన్ డాక్టర్ జి రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు ."IQAC మేజర్ సబ్జెక్టు "అంశంపై IQAC కోఆర్డినేటర్ డాక్టర్ కే సురేష్ ఈ అంశం పైన అధ్యాపక సిబ్బందికి అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా డాక్టర్ సురేష్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ లో "ఏపీ ఎస్ సి హెచ్ ఈ" వారు ప్రవేశపెట్టిన ఆనర్స్ డిగ్రీ నాలుగు సంవత్సరాల కోర్సు గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ విద్యా విధానంలో సైన్స్ ఆర్ట్స్ మరియు కామర్స్ విద్యార్థుల మేజర్ మరియు మైనర్ సబ్జెక్టుల గురించి అలాగే నూతన విద్యా విధానంలో భాగంగా భారతీయ విద్య, చరిత్రకు, సంస్కృతము, కళలకు, యోగ వంటి అంశాలకు పెద్దపీట వేశారని, సంస్కృత భాషకు ప్రాధాన్యం ప్రస్తుత సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా మారిన విద్యా విధానం ఉంటుందని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జువాలజీ అధ్యాపకులు డాక్టర్ సురేష్ గారిని కళాశాల చైర్మన్ అభినందించడం జరిగింది. కళాశాల చైర్మన్ డాక్టర్ జి రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి చరిత్రకు మారిన విద్యా విధానంలో ప్రాధాన్యం ఉంటుందని ఆర్యభట్ట చరకుడు శివాజీ వీరి జీవిత చరిత్రలు ఆచరణ యోగ్యమైనవిని క్రీస్తు శకము ఆరో శతాబ్దంలోనే నలంద తక్షశిల వంటి విశ్వవిద్యాలయాలలో విదేశీయులు కూడా సంస్కృతము వ్యాకరణము నీతి శాస్త్రము చరిత్ర వంటి అంశాలు చదివారని కొన్ని వేల మంది విద్యార్థులు ఇక్కడ మన గ్రంథాలను మన సంస్కృత భాషను అధ్యయనం చేశారని ఖగోళ శాస్త్రాన్ని క్షుణ్ణంగా చదివారని చెప్పారు. పాశ్చాతులు మన దేశానికి రాక పూర్వమే మన దేశంలో గొప్ప గురుకుల విద్యా విధానము క్రమశిక్షణతో కూడిన విద్య అమలులో ఉండేదని అయితే నేడు అవన్నీ మరుగున పడిపోయాయని నూతన విద్యా విధానం వలన వాటిని తిరిగి విద్యార్థులు చదవడం వలన నిజమైన చరిత్ర చదివిన వారు అవుతారని యువతలో నైపుణ్యము నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయనీ పెరుగుతున్న సైన్స్ సాంకేతిక పరిజ్ఞానం కూడా మారిన విద్యా విధానంలో ఉంటుందని వివరించారు.విద్యార్థులకు అవగాహన కలిగించే ముందు అధ్యాపకులు క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలని ఈ వర్క్ షాప్ ను నిర్వహించామని రామకృష్ణారెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీ సుబ్బయ్య పీజీ మరియు డిగ్రీ అధ్యాపకులు పాల్గొన్నారు.



## కాళేశ్వరం త్రివేణీ సంగమం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి, ప్రాణహిత నదులు

భూపాలపల్లి :

ఎగువన వర్షాలతో కాళేశ్వరం త్రివేణీ సంగమం వద్ద గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వరద పోటెత్తడంతో త్రివేణీ సంగమం వద్ద నీటిమట్టం 13.29 మీటర్లకు చేరింది. దీంతో పుష్కరఘాట్ మెట్ల నుంచి రోడ్డుపైకి వరద నీరు చేరింది.ఇక కాళేశ్వరం ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద. మేడిగడ్డ బ్యారేజీకి 13.37 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం. దీంతో 85 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. దిగువన ఉన్న అన్నారం బ్యారేజీకి 5.11 లక్షల క్యూసెక్కుల వరద ప్రవహం వస్తుండటంతో 66 గేట్లు ఎత్తి 5.11 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.కాగా, నిజాం సాగర్ ప్రాజెక్టుకు 20 క్యూసెక్కుల వరద వస్తున్నది. దీంతో అధికారులు నాలుగు గేట్ల ద్వారా వచ్చిన నీటిని వచ్చినట్లే విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1404.66 అడుగుల వద్ద నీటిమట్టం ఉన్నది. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు. అదేవిధంగా 17.802 టీఎంసీల నీటికిగాను 17.311 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది.

## పీర్ల దేవుళ్ళు త్యాగానికి గుర్తుగా మొహారం

కౌతాళం :

కౌతాళం మండలంలో కుంటనహల్, రౌదురు, బడినెహల్, ఉరుకుందా తదితర గ్రామాల్లో కొలువైన పీర్లదేవుళ్ళు కులమతాలకు అతీతంగా భక్తిశ్రద్ధలతో కొలిచే ఆరాధ్య దేవుళ్ళు శనివారం ప్రశాంతంగా వేడుకలు ముగిశాయి.గత పీర్లదేవుళ్ళు గ్రామ ప్రజలందరు 10 రోజులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫతేహాలు, షర్బట్, రోటీలను నైవేద్యం సమర్పించారు. ముస్లిం లు అత్యంత భక్తిశ్రద్ధలతో చేసుకునే పండుగ మొహారం ఒకటి పది రోజులు పాటు జరిపే ఈ పండుగ సందర్భంగా ఇస్లాంకు సంబంధించిన ప్రవచనములు మొహమ్మద్ ప్రవక్త బోధనలు వినిపిస్తాయి మొహారం నెల పదోరోజున పీర్లను ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ సమయంలో పెద్ద ఎత్తున హజ్రత్ ఇమాం హుషేన్ ను అసైన్ హుష్తైన్,అక్బర్ అలీ మరియు పీర్ల దేవుళ్ల గుర్తుగ పంజా (ప్రతిమ) లను ఉరేగించి తమ సంతాపం ప్రకటిస్తారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం తొలి మాసాన్ని మొహారం నెలగా భావిస్తారు. మొహారం పండుగ పదో రోజున ప్రత్యేకత ఉంది 10,11 వ రోజుల్లో ఉపవాస దీక్షలు పాటించడాన్ని ముస్లింలు పవిత్రంగా భావిస్తారు. మొహారం నెలలో ముస్లింలు ఎలాంటి శుభకార్యాలు నిర్వహించారు. తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన హజ్రత్ ఇమామ్ హుషేన్ కు సంతాపం తెలిపే ఉద్దేశ్యం తో ముస్లింలు పాటిస్తారు.మానవ హక్కులకోసం జరిగిన చరితాత్మక పోరాటం మొహారం ఈ పేరు వినగానే పిర్లు, నిప్పుల గుండాలు గుండెలు బాదుకుంటు మతం చడవటాలు గుర్తుకువస్తాయి. శనివారం గ్రామ ,మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సాయంత్రం పీర్లదేవుళ్ళు ఊరేగింపుగ వెళ్లారు.ఊరేగింపు లోప్రజాలు నైవేద్యాలు సమర్పించారు.అనంతరం పీర్ల దేవుళ్ళు భక్తి భావంతో ప్రత్యేక ఫతేహాలు,ఏటికి తీసుకుని వెళ్లారు. ప్రత్యేక ఫతేహాలు అనంతరం షర్బట్ ,రొట్టెలు పంచి పెట్టారు. ఎస్ ఐ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బారి బంద్బస్తు చేపట్టారు. భారీగా ముస్లిం సోదరులు, హిందు సోదరులు పాల్గొన్నారు.



జయభేరి సినిమా

# హోరాహోరీ పోరులో ఎన్నికలు పూర్తి..




తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికల్లో దిల్ రాజు ప్యానెల్ ఘనవిజయం సాధించింది. హైదరాబాద్‌లోని ఫిల్మ్ ఛాంబర్‌లో మధ్యాహ్నం 3 గంటల వరకు ఓటింగ్ జరుగగా.. సాయంత్రం 4 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం అయింది. ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ లో ప్రొడ్యూసర్ సెక్టార్, డిస్ట్రిబ్యూషన్ సెక్టార్, స్టూడియో సెక్టార్, ఎగ్జిక్యూటివ్ సెక్టార్ల నుంచి 1600 మంది సభ్యులు ఓటుహక్కు వినియోగించుకునున్నారు. అధ్యక్ష బరిలో స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు ప్యానెల్ వర్సెస్ సి కళ్యాణ్ ప్యానల్ పోటీ పడ్డాయి. కాగా, సాయంత్రం 6 గంటలకు ఓట్ల లెక్కింపు ముగిసింది. మొదటి రౌండ్ ఓట్ల లెక్కింపు నుంచి దిల్ రాజు ప్యానెల్ ఆధిపత్యం చూపించింది. మొత్తం 14 రౌండ్లు జరుగగా దిల్ రాజు ప్యానెల్ కు 563 ఓట్లు రాగా.. సి కళ్యాణ్ ప్యానెల్ కు 497 ఓట్లు వచ్చాయి. డిస్ట్రిబ్యూషన్ ప్యానెల్ లో ఇరు వైపుల నుంచి సమానంగా ఆరుగురు చొప్పన గెలుపొందారు. స్టూడియో సెక్టార్ లో నలుగురికి గానూ దిల్ రాజు ప్యానెల్ నుంచి ఏకంగా ముగ్గురు విజయం సాధించారు. నిర్మాతల విభాగంలో 12 మంది నిలుచోగా దిల్‌రాజు ప్యానెల్ నుంచి ఏడుగురు గెలిచారు. దిల్‌రాజు, దామోదర ప్రసాద్, మోహన్ వడ్లపాటి, స్రవంతి రవికిశోర్, పద్మిని, రవిశంకర్ యలమంచిలి, మోహన్‌గౌడ్‌లను విజయం వరించింది.



# టాలీవుడ్ హీరోల గురించి తమన్నా

టాలీవుడ్ హీరోల గురించి తన అభిప్రాయలను తమన్నా భాటియా వెల్లడించింది. ఒక్కో హీరో గురించి తాను ఏమనుకుంటున్నదో తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా తెలుగులో దాదాపు స్టార్ హీరోలందరితో కలిసి నటించింది. టాప్ హీరోయిన్‌గా వెలుగొందుతోంది. ఇప్పుడు సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌ల్లోనూ అదరగొడుతోంది. భోళా శంకర్ చిత్రంలో మెగాస్టార్ చిరంజీవి సరసన తమన్నా భాటియా హీరోయిన్‌గా చేసింది. ఆగస్టు 11వ తేదీన ఈ మూవీ థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్లను వేగంగా చేస్తోంది చిత్ర యూనిట్. భోళా శంకర్ కోసం కొన్ని ఇంటర్వ్యూల్లోనూ పాల్గొంటోంది తమన్నా. భోళా శంకర్ సినిమా కోసం దర్శకుడు మెహర్ రమేశ్, హీరోయిన్ తమన్నా, సుశాంత్ కలిసి ఓ ఇంటర్వ్యూ చేశారు. కమెడియన్ ఆది ఇంటర్వ్యూలో వారిని ప్రశ్నలు అడిగాడు. ఈ క్రమంలో తాను నటించిన టాలీవుడ్ హీరోల గురించి ఏమనుకుంటున్నారంటూ పేర్లను చెప్పాడు ఆది. దీనికి తమన్నా సమాధానాలు చెప్పింది. చిరంజీవి, ప్రభాస్, పవన్ కల్యాణ్, మహేశ్ బాబు, ఎన్టీఆర్, అల్లు అర్జున్, రామ్ చరణ్ గురించి తమన్నాను అడిగాడు ఆది. ఈ పేర్లకు ఒక్కొక్కటిగా సమాధానాలు ఇచ్చింది తమన్నా. చిరంజీవి ప్రత్యేకమైన వ్యక్తి.. వన్ అండ్ ఓన్లీ.. ఎవరూ ఆయనలా ఉండలేరని తమన్నా చెప్పింది. పవన్ కల్యాణ్ చాలా మాస్, చాలా స్టైలిష్ అని తెలిపింది. ప్రభాస్.. అందరి డార్లింగ్ అని తమన్నా చెప్పింది. మహేశ్ బాబు చాలా అందంగా ఉంటారని, మోస్ట్ గ్లామరస్ హీరో అని తమన్నా తెలిపింది. జూనియర్ ఎన్టీఆర్ ఆల్ రౌండర్ అని, ఏదైనా చేయగలని తమన్నా అభిప్రాయపడింది. ఎన్టీఆర్ డ్యాన్స్, ఫైట్స్ అన్నీ తనకు ఇష్టమని తమన్నా చెప్పింది. అల్లు అర్జున్ తెలుగు సినీ ఇండస్ట్రీకి స్టైలిష్ స్టార్ అని, ఇప్పుడు దేశమంతా పాపులర్ అయ్యారని తమన్నా చెప్పింది. రామ్ చరణ్ తనకు రాయల్ అని, ఎప్పుడూ రాయల్‌గా ఉంటారని, తాను కలిసినప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన అలాగే ఉన్నారని తమన్నా చెప్పింది. టాలీవుడ్ ఇండస్ట్రీలో రామ్ చరణ్ రాయల్ అని తమన్నా అభిప్రాయపడింది. హీరోలందరి మీద తమన్నా ఫీలింగ్ ఏంటో ఆడియన్స్ ఎప్పటి నుంచో తెలుసుకోవాలని అనుకుంటున్నారని, అందుకే తాను ఈ ప్రశ్న వేశానని ఆది చెప్పుకొచ్చాడు. కాగా, వేదాళం సినిమాకు భోళా శంకర్ చిత్రం సీన్ బై సీన్ రీమేక్ కాదని తమన్నా స్పష్టం చేసింది. హీరో చిరంజీవికి తగ్గట్టుగా.. తెలుగు ఆడియన్స్‌కు నచ్చే విధంగా తెరకెక్కిందని తమన్నా చెప్పింది. భోళా శంకర్ చిత్రంలో చిరంజీవి సరసన తమన్నా భాటియా హీరోయిన్‌గా నటించింది. చిరూ చెల్లెలి పాత్రను స్టార్ హీరోయిన్ కీర్తి సురేశ్ పోషించింది. సుశాంత్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. ఇప్పటికే వచ్చిన భోళా శంకర్ ట్రైలర్, పాటలు అభిమానులను ఆకట్టుకున్నాయి. ఆగస్టు 11వ తేదీన ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది.



# రజినీ కాంత్ 'హుకుం' సాంగ్ రిలీజ్..

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా నటిస్తున్న జైలర్ చిత్రంపై అంచనాలు భారీగా నెలకొన్నాయి. ముఖ్యంగా పాటలు సూపర్ హిట్ అవుతుండటంతో ఈ సినిమాపై మంచి క్రేజ్ ఏర్పడింది. కావాలా, హుకుం సాంగ్స్ ఊపేస్తున్నాయి. కాగా, నేడు జైలర్ చిత్రం నుంచి హుకుం సాంగ్ తెలుగు వెర్షన్ రిలీజ్ అయింది. ఈ సాంగ్‌ను తెలుగులో లాంచ్ చేశారు సీనియర్ హీరో విక్టరీ వెంకటేశ్. హుకుం తెలుగు వెర్షన్ లిరికల్ సాంగ్‌ను ఆయన విడుదల చేశారు. హుకుం తెలుగు వెర్షన్ సాంగ్ కూడా చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. అనిరుధ్ రవిచందర్ అందించిన ఇంటెన్స్ మ్యూజిక్ అదిరిపోయింది. తెలుగులోనూ ఈ సాంగ్ బాగా సెట్ అయింది. హుకుం తెలుగు పాటకు భాస్కరభట్ల రిలిక్స్ అందించారు. సాంగ్ కంటే ముందు రజినీ కాంత్ పవర్ ఫుల్ డైలాగ్ ఉంది. ఆ తర్వాత "ఉరుముకి.. మెరుపుకి పుట్టాడురా.. పిడుగును పిడికిట పట్టాడురా" అంటూ తెలుగులో హుకుం సాంగ్ మొదలవుతుంది. మ్యూజిక్, రజినీ స్టైల్‌కు తగ్గట్టు పవర్‌ఫుల్ లిరిక్స్ అందించారు భాస్కరభట్ల. తెలుగులో ఈ పాటను దినకర్ కాల్వల పాడారు. హుకుం లిరికల్ సాంగ్‌లో రజినీ కాంత్ స్టైల్, స్వాగ్ అదిరిపోయాయి. పూర్తి యాక్షన్ మోడ్‌లో ఈ పాట ఉంది. జైలర్ చిత్రం ఆగస్టు 10వ తేదీన తమిళంలో పాటు తెలుగులోనూ విడుదల కానుంది. నెల్సన్ దిలీప్ కుమార్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించాడు. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్.. జైలర్ చిత్రాన్ని నిర్మించారు. జైలర్ సినిమాలో తమన్నా భాటియా హీరోయిన్‌గా నటిస్తోంది. మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ అతిథి పాత్రలో కనిపించనున్నారు. కన్నడ స్టార్ హీరో శివరాజ్ కుమార్ కీలక పాత్ర పోషించారు. జాకీ ష్రాఫ్, రమ్యకృష్ణ, సునీల్, వినాయకన్, మిర్నా మీనన్, వసంత్ రవి కీలక పాత్రల్లో నటించారు. సినిమా విడుదల దగ్గరపడుతుండటంతో అతిత్వరలోనే జైలర్ ట్రైలర్ కూడా వచ్చే ఛాన్స్ ఉంది.

# బిగ్ బాస్‌లోకి నటి శోభా శెట్టి



కార్తీక దీపం ఫేమ్ శోభా శెట్టి బిగ్ బాస్ లోకి అడుగుపెట్టనుంది. ఇటు తెలుగు, అటు కన్నడలో బిజీగా ఉంటుంది శోభా శెట్టి. కన్నడ బుల్లితెరపై ప్రస్థానాన్ని మొదలు పెట్టింది ఈ ముద్దుగుమ్మ. తెలుగులోనే ఎక్కువ బిజీగా ఉంది. సినిమాల్లో అవకాశం రావడంతో శోభ కన్నడలో ఓ సీరియల్ మధ్యలోనే వదిలేసింది. శోభ పుట్టి పెరిగింది బెంగళూరులోనే. ఎంఎస్‌ఈ చదివిన శోభకు చిన్నప్పటి నుంచి నటన అంటే ఇష్టం. శోభాశెట్టి నటించడానికి ముందు ఓ కంపెనీలో పని చేసేది. 2013లో అగ్నిసాక్షి సీరియల్‌తో శోభ తన రంగుల జీవితాన్ని ప్రారంభించింది. సీరియల్‌లో నటిస్తూనే అంజనీపుత్ర సినిమాలో పునీత్ రాజ్‌కుమార్‌కు చెల్లెలుగా అవకాశం రావడంతో ఆ సీరియల్‌ని సగంలోనే వదిలేసింది. కన్నడలో చాలా సీరియల్స్ లో అవకాశాలు అందిపుచ్చుకుని తన టాలెంట్ నిరూపించుకుంది. తర్వాత తెలుగు బుల్లితెరపై అవకాశం వచ్చింది. కార్తీక దీపం సీరియల్ తో తెలుగు ప్రేక్షకులకు మోనితగా దగ్గరైంది. కార్తీక దీపంతో మంచి క్రేజ్ సంపాదించింది. శోభ కొన్ని తెలుగు రియాల్టీ షోలలో కూడా కనిపించింది. శోభకు తెలుగులో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. ఆమెకు స్వంత యూట్యూబ్ ఛానెల్ ఉంది. అందం, వంటలు, చిట్కాలను చెబుతుంది. అక్కినేని నాగార్జున హోస్ట్ చేస్తున్న బిగ్ బాస్ తెలుగు సీజన్ 7 ఆగస్ట్ నెలలో ప్రారంభం కానుంది. బిగ్ బాస్ హౌస్ లోకి శోభా శెట్టి కూడా వెళ్లనుంది. బిగ్ బాస్ లో పోటీ చేసే జాబితాలో శోభాశెట్టి పేరు కూడా ఉందని తెలుస్తోంది. దీనికోసం ఆమె భారీ మొత్తంలో పారితోషికం తీసుకుంటుదట. తెలుగులో మంచి పేరు సంపాదించిన శోభాశెట్టి.. బిగ్ బాస్‌ద్వారా ప్రేక్షకులకు మరింత దగ్గర కావాలని చూస్తోంది.






## ప్రెగ్నెన్సీపై విషయం బయటపెట్టిన

# కియారా అద్వానీ

బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ.. హీరో సిద్ధార్థ్ మల్హోత్రాను ప్రేమించి ఇటీవలే పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. కాగా, పెళ్లైన కొన్నాళ్లకు కియారా పోస్ట్ చేసిన ఫొటోలు చూసి.. బేబీ బంప్ కనిపిస్తోంది, తను ప్రెగ్నెంట్ కావొచ్చని ఊహాగానాలు వచ్చాయి. కియారా కూడా పెళ్లికి ముందే ప్రెగ్నెంట్ అయిందని ప్రచారం కూడా జరిగింది. తర్వాత కొన్ని రోజులకు ఆ వార్తల్లో నిజం లేదని క్లారిటీ ఇచ్చింది కియారా. ఈ క్రమంలో 2019లో జరిగిన మూవీ ప్రమోషన్స్ లో కియారా మాట్లాడిన మాటలు.. ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆ సినిమాతో అకీరా నందన్ ఎంట్రీ ప్రెగ్నెంట్ అయితే.. తనకు నచ్చిన ఫుడ్ తింటూ హ్యాపీగా ఉంటానని చెప్పింది. పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉంటే చాలని, ఎలా ఉన్నా పరవాలేదని తన మనసులో కోరికలను బయటపెట్టింది. తనకు ప్రెగ్నెంట్ కావాలనుందని, దానికోసమే వెయిట్ చేస్తున్నట్లు చెప్పుకొచ్చింది. దీంతో కియారా ఫ్యాన్స్.. తను ఎప్పుడు గుడ్ న్యూస్ చెప్తుందా అని వెయిట్ చేస్తున్నారు. అయితే, కియారా మాత్రం కెరీర్ పైనే ఫోకస్ పెట్టింది. ప్రస్తుతం రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ లో నటిస్తోంది.

# బ్రో రెండో రోజు కలెక్షన్స్ ఇవే.. సెకండ్ డే ఏమైంది బ్రో?

పవన్ కల్యాణ్, సాయి ధరమ్ తేజ్ కలిసి నటించిన బ్రో సినిమాకు మంచి టాక్ వచ్చింది. వింటేజ్ పవన్ కల్యాణ్ ను చూసి ఫ్యాన్స్ తెగ ఎంజాయ్ చేస్తున్నారు. మొదటి రోజు ఈ సినిమాకు భారీగా కలెక్షన్స్ వచ్చాయి. అయితే రెండో రోజు కాస్త వసూళ్లు తగ్గినట్టుగా కనిపిస్తోంది. మామ అల్లుళ్లు పవన్ కల్యాణ్, సాయి ధరమ్ తేజ్ బాక్సాఫీసును షేక్ చేస్తున్నారు. ఈ ఇద్దరు కలిసిన నటించిన BRO చిత్రం అసాధారణ ఓపెనింగ్‌తో బాక్సాఫీస్ దగ్గర మ్యాజిక్‌ను సృష్టించింది. మొదటి రోజున రూ. 30.05 కోట్లు సంపాదించింది. 2వ రోజు కొంచెం తగ్గినప్పటికీ, విడుదలైన రెండు రోజుల్లోనే రూ. 50.05 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ చిత్రం రాబోయే వారాంతంలో మంచి వసూళ్లు సాధించే అవకాశం ఉంది. పవన్ ఫ్యాన్స్ మాత్రం థియేటర్లలో పండగ చేసుకుంటున్నారు. పవన్ లుక్, వచ్చే పాటలతో సీట్లలో ఎగిరి గంతేస్తున్నారు. పవన్ కల్యాణ్, సాయి ధరమ్ తేజ్ కలిసి నటించిన చిత్రం కావడంతో ముందు నుంచే అంచనాలు భారీగా ఉన్నాయి. దానికి తగ్గట్టుగానే సినిమా ఉందని ఫ్యాన్స్ అంటున్నారు. 1వ రోజు సినీ ప్రేక్షకుల నుండి విపరీతమైన రెస్పాన్స్ వచ్చింది. రాబోయే వారాంతంలో మంచి వసూళ్లు రాబడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ చిత్రం మొదటి రోజు భారతదేశంలో 30.05 కోట్ల రూపాయలను వసూలు చేసింది. అయితే శనివారం కొంచెం తగ్గుదల కనిపించింది. అయినప్పటికీ మొత్తంగా చూసుకుంటే మంచి వసూళ్లే సాధించింది. అంచనాల ప్రకారం.. రెండో రోజున, భారతదేశంలో బ్రో సినిమా రూ. 20.00 కోట్లు వసూళ్లు చేసింది. జూలై 29 థియేటర్లలో 71.88 శాతం ఆక్యుపెన్సీని సాధించిందని తెలుస్తోంది. విడుదలైన రెండు రోజుల్లోనే రూ. 50.05 కోట్ల క్లబ్‌లో చేరగలిగింది. పవన్ కల్యాణ్, సాయి ధరమ్ తేజ్, ప్రియా ప్రకాష్ వారియర్, కేతిక శర్మ నటించిన ఈ 'BRO' సినిమా థియేటర్‌లలోకి వచ్చింది. ఊర్వశి రౌతేలా అతిథి పాత్రలో కనిపిస్తుంది. సముద్రఖని ఈ సినిమాకు దర్శకత్వం వహించగా.. స్క్రీన్ ప్లే త్రివిక్రమ్ రాశారు. మరణం తర్వాత తన తప్పులను సరిదిద్దుకోవడానికి రెండో అవకాశం పొందే వ్యక్తి చుట్టూ కథ తిరుగుతుంది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి ఊర్వశి రౌతేలా ప్రత్యేక అతిథి పాత్రలో కనిపించి ఆకట్టుకుంది. థమన్ సంగీతం అందించగా.., సుజిత్ వాసుదేవ్ సినిమాటోగ్రఫీ, నవీన్ నూలి ఎడిటింగ్ చేశారు. ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించాయి. ఇక పవన్ కల్యాణ్ చివరిసారిగా 2022లో భీమ్లా నాయక్ లో కనిపించాడు. ఇప్పుడు బ్రో తో మరో హిట్ అందుకున్నాడు. ఇక ఆయన చేతిలో చాలా ప్రాజెక్టులు ఉన్నాయి. ఉస్తాద్ భగత్ సింగ్, OG, PSPK 29తో సహా పలు రాబోయే ప్రాజెక్ట్‌ల కోసం వర్క్ చేస్తున్నాడు. మరోవైపు సాయి ధరమ్ తేజ్ చివరిగా తెలుగు హారర్ చిత్రం విరూపాక్షలో కనిపించాడు. ఇందులో సంయుక్త కలిసి నటించాడు. ఇప్పుడు బ్రో సినిమాతో మరో హిట్ తన ఖాతాలో వేసుకున్నాడు మెగా మేనల్లుడు.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com